


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
SUPHALA AKSHARAM

## అవసరమైన ప్రతిచోటా కొత్త రోడ్లు

- వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు: పొన్నం ప్రభాకర్
- నగర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలు: కిషన్‌రెడ్డి
- ముషీరాబాద్‌లో 1.60 కోట్లతో సీసీ రోడ్డు పనులు

➤ 2వ పేజిలో..

MONDAY 11TH AUGUST 2025 EDITOR: SHAIK.YACOOB PASHA PAGES: 12 VOLUME: 08 ISSUE: 136 COST: 3/- TELANGANA

సోమవారం 11 ఆగస్టు 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 136 వెల : రూ.3/- తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## నేడు మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన..

**మంథని, ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**
రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోమవారం మంథని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అయింది కార్యక్రమంలో పర్యటించదున్నారు. సోమవారం ఉదయం 12గంటలకు కమాన్ పూర్ మండలంలో రూ. 65లక్షల నిధులతో నిర్మించిన నూతన పీఏసీఎస్ భవనాన్ని, రూ. 79 లక్షల నిధులతో నూతన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కమాన్ పూర్ బ్రాంచ్ భవనాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు. 12-30 నిమిషాలకు మంథని మండలం చిల్లపల్లి గ్రామం వద్ద తెలంగాణ రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి రూ. 6.93లక్షలతో 5 ఎకరాల స్థలంలో నిర్మించబోతున్న 2 గోదాములకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1 గంటలకు మంథని మండలం గుంజపడుగు గ్రామం వద్ద రూ. 2.90కోట్లతో(పీఎం కూసుమ్) మంథని పాక్స్ వారి సోలార్

➤ మిగతా 2వ పేజిలో..

# నగరంలో సీఎం పర్యటన



**హైదరాబాద్ ఆగస్టు 10 అక్షరంన్యూస్)**
గత కొన్ని రోజులుగా హైదరాబాద్ నగరాన్ని అతలాకుతలం చేస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. రోడ్లు జలమయమవడం, లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ మరోసారి హెచ్చరీక జారీ చేయడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

**ముంపు ప్రాంతాల్లో సీఎం పర్యటన**

వాతావరణ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశముండటంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో కలిసి ఆయన హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, గంగుబాయి బస్తీ, బుద్ధనగర్ వంటి ప్రధాన ముంపు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు.

**ప్రజలతో నేరుగా ముఖాముఖి**

నీటి ముంపుతో ఇబ్బందులు పడుతున్న స్థానికులతో సీఎం రేవంత్‌నేరుగా మాట్లాడారు. వర్షాల తర్వాత మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తుండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను విన్నారు. వారికి తగిన శాశ్వత పరిష్కారం తీసుకురావడం తన ప్రభుత్వ బాధ్యత అని ప్రజలకు భరోసా ఇచ్చారు.

**అధికారులకు తక్షణ ఆదేశాలు**

పర్యటన అనంతరం సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్ష ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి నిల్వ తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థ ను మెరుగుపరచే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అలాగే, విద్యుత్ స్తంభాలు, ఓపెన్ మ్యాన్‌హోల్స్ వంటివి ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

**ముందు జాగ్రత్త చర్యలు కీలకం**

వర్షాలు మరో కొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. ప్రజల జీవన ప్రమాణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న భరోసాతో సీఎం పర్యటన ముగిసింది. ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు.

## దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా సాగునీరును అందిస్తాం



- ప్రభుత్వానికి అత్యంత ప్రాముఖ్యమైన ప్రాజెక్టు దేవాదుల
- దేవాదుల ప్రాజెక్ట్ తో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తాం
- రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క

➤ 10వ పేజిలో..

## పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


**హైదరాబాద్, ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**
సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. పాపన్న రాజ్యాధికారాన్ని స్థాపించి చరిత్రలో నిలిచారంటే ఆనాటి సామాజిక వర్గాలను కలుపుకొనిపోయి నాయకత్వం వహించినందునే అని పేర్కొన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సర్దార్ పాపన్న మహరాజ్ ధర్మ పాలన సంస్థ(ఎసపీడీపీవో), జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఈ ఒక్క సంవత్సరంలోనే 40 లక్షల ఈత మొక్కలు నాటిస్తున్నామని, పాపన్న గౌడ్ వారసులుగా గౌడ వృత్తిని రక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణాలో వర్షాలు

**హైదరాబాద్ ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**
తెలుగు రాష్ట్రాల్లో వర్షాల బీభత్సం మళ్లీ చెలరేగే సూచనలు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా ప్రకటన ప్రకారం, ఆగస్టు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది వాయవ్య మరియు పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో సృష్టి కానుంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రం అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ విషయమై రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ స్పందించారు. హైదరాబాద్‌లోని పశ్చిమ భాగాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తొచ్చు. కార్యాలయాలు 13, 14 తేదీల్లో పని సమయాల్లో మార్పులు చేసుకోవాలి, అని సూచించారు. ఆగస్టు 13, 14 తేదీలకు వాతావరణ శాఖ అలర్ట్‌ఆగస్టు 13న తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడనున్నాయని పేర్కొంది. వాటిలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, తదితర జిల్లాలున్నాయి. అదే రోజు హైదరాబాద్ లోనూ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆగస్టు 14న మరింత ఎక్కువ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇవి నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలుగా పేర్కొనబడ్డాయి.

ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షం వల్ల అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం కూడా వర్షాలు కొనసాగినట్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఓ హెచ్చరిక జారీ చేశారు. అనవసరంగా బయటకు రావద్దు. ఇళ్లలోనే



ఉండండి, అని సూచించారు. ఒక గంటలో 10సెం.మీ వర్షం కురుస్తోంది.

➤ మిగతా 2వ పేజిలో..

## ఢిల్లీకి వెంకయ్యనాయుడు.. ఆసక్తికర పరిణామాలు..!

హైదరాబాద్: , ఆగస్టు 10 (అక్షరంన్యూస్)



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఢిల్లీ పర్యటనలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆయన ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కీలక నేతలతో భేటీ అయ్యారు. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్‌ను కలిశారు. దేశ్‌బంధు గుప్త రోడ్‌లో కొత్తగా నిర్మించిన రాష్ట్రీయ్ స్వయం సేవక్ సంఘ్ కార్యాలయం 'కేశవ్ కుంజ్'ను ఆదివారం సందర్శించిన ఆయన.. సంస్థ ప్రాంగణంలో ఉన్న 'శ్రీ కేశవ్ బలీరాం హెడ్గేవార్' విగ్రహానికి నివాళు లర్పించారు. వెంకయ్య వెంట ఆయన మిత్రులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, తుమ్మల రంగారావు ఉన్నారు. శనివారం ప్రధాని మోదీతో సమావేశమైన వెంకయ్య నాయుడు ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమైన ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ ఒక వైపు ఉప రాష్ట్రపతి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, మరోవైపు పార్టీ జాతీయ అధ్యక్షుడి నియామకం తదితర పరిణామాల నేపథ్యంలో ఆయన పర్యటన ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ పర్యటన సందర్భంగా కీలక అంశాలపై వెంకయ్య నాయుడుతో కేంద్ర ప్రభుత్వ, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు చర్చించి.. సలహాలు సూచనలు కోరినట్లు సమాచారం.

# అవసరమైన ప్రతిచోటా కొత్త రోడ్లు

- వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు: పొన్నం ప్రభాకర్
- నగర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలు: కిషన్‌రెడ్డి
- ముషీరాబాద్‌లో 1.60 కోట్లతో సీసీ రోడ్డు పనులు

**ముషీరాబాద్, ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అవసరమైన ప్రతి చోటా ఆధునిక రోడ్లు వేస్తున్నామని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను ఆధునికీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా నుంచి దాయారం మార్కెట్ వరకు రూ.కోటి 60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై వర్షపునీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, వరద నీటి నాలాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అధికారు లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం చాలా పెద్దదని, అభివృద్ధి పనులకు నిధు ల లేమి వల్ల అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయన్నారు. అధికారులు దృష్టి సారించి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు

**బిహార్‌లో ఒకలా.. తెలంగాణలో మరొకలా ఎందుకు?: జైరాం రమేశ్**




**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. ఎంతో చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తుంటే, కేంద్రంలోని బీజేపీ మాత్రం ఉద్దేశపూర్వకంగానే కొర్రీలు పెడుతోందని ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. బిహార్‌లో బీసీ బిల్లు గవర్నర్ సమ్మతితో అధికారికంగా చట్టంగా మారితే.. తెలంగాణలో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి సమ్మతి కోసం పంపారన్నారు. 4 నెలలు గడిచినా రాష్ట్రపతి నుంచి ఎటువంటి సమాధానం లేదని చెప్పారు. బిహార్‌లో బిల్లు విషయంలో ఆలస్యం చేయించడం, అడ్డుకోవడం బీజేపీకి సాధ్యం కాలేదన్నారు. అయితే తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని.. ఆ పార్టీకి సామాజిక న్యాయంపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేలిపోయిందని విమర్శించారు. బీజేపీ అడ్డుకోకపోతే 4 నెలలుగా రాష్ట్రపతి వద్దే ఆ బిల్లు పెండింగ్‌లో ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

# 5 సీజన్లు.. కోటి మెట్రిక్ టన్నులు

- రైస్‌మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యం నిల్వలు.. బియ్యంగా వసూలైతే 25 వేల కోట్ల ఆదాయం
- సామర్థ్యానికి మించి మిల్లర్లకు వడ్ల కేటాయింపులు
- రూ.50 వేల కోట్లు దాటిన పౌరసరఫరాల సంస్థ అప్పు



హైదరాబాద్, ఆగస్టు 10 అక్షరంన్యూస్)

రైస్‌మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు భారీగా పేరుకపోయాయి. ఐదు సీజన్లకు సంబంధించిన కోటి టన్నుల ధాన్యం రైస్‌మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ధాన్యం తీసుకున్న మూడు నెలల్లోగా బియ్యం అప్పగించాల్సిన రైస్‌మిల్లర్లు.. ఏళ్లతరబడి బియ్యం అప్పజెప్పకుండా మొండికేస్తున్నారు. ఐదు సీజన్లలో కలిపి సుమారు రూ.25 వేల కోట్ల విలువైన బియ్యం రైస్‌మిల్లర్ల వద్దే బ్లాక్ అయిపోయింది. సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అప్పగించకపోవటంతో పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన రూ.25 వేల కోట్ల ఆదాయం నిలిచిపోయింది. ఒకవైపు పాత బకాయిలు వసూలు కాకపోవటం, మరోవైపు కార్పొరేషన్ అప్పు రూ.50 వేల కోట్లు దాటిపోవడం చర్చనీయాంశంగా మారింది. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలుచేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు కస్టమ్ మిల్లింగ్ కోసం అప్పగిస్తుంది. రైస్‌మిల్లర్లు ధాన్యం తీసుకున్న వెంటనే మిల్లింగ్ ప్రారంభించాలి. ఎప్పటికప్పుడు బియ్యం లోడ్ చేసి.. ఎఫ్‌సీఐకిగానీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు గానీ అప్పగించాలి. కానీ కొన్నేళ్లుగా ఈ గొలుసు వ్యవస్థ దెబ్బతింది. ఫలితంగా ప్రభుత్వానికి భారీ నష్టం కలుగుతోంది. ధాన్యం సేకరించే సమయంలో ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ ఇస్తే.. బ్యాంకుల నుంచి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు తెచ్చి రైతులకు డబ్బులు చెల్లిస్తోంది. మిల్లర్లు సీఎంఆర్ అప్పగిస్తేనే ఎఫ్‌సీఐ నుంచి పేమెంట్స్ వస్తాయి. అయితే సకాలంలో సీఎంఆర్ డెలివరీ చేయకపోవటంతో ఎఫ్‌సీఐ నుంచి డబ్బులు రావటంలేదు. దీంతో మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు, బియ్యం బకాయిలు పెరిగిపోతుండగా.. బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి వడ్డీ విపరీతంగా పెరిగిపోతోంది.

### రైస్‌మిల్లుల్లో కోటి టన్నుల ధాన్యం

ఎఫ్‌సీఐ లెక్కల (ప్రొవిజనల్ కాస్టింగ్ షీట్) ప్రకారం క్వింటా బియ్యానికి రూ.3,600 ధర వస్తుంది. అంటే టన్నుకు రూ. 36 వేలు వస్తాయి. 2023- 24లో రెండు సీజన్లలో కలిపి 8.25 లక్షల టన్నుల ధాన్యం, 2024-25 వానాకాలంలో 18 లక్షల టన్నులు, యాసంగిలో 56 లక్షల టన్నుల ధాన్యం కలిపి కోటి మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం రైస్‌మిల్లుల్లో ఉండిపోయింది. దీనిని మిల్లింగ్‌చేస్తే 68.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం వస్తుంది. ఈ బియ్యం విలువ రూ. 24,660 కోట్లు ఉంటుంది.

### కేటాయింపులు సరే... రికవరీ ఏది?

ధాన్యం కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. రైస్‌మిల్లుల సామర్థ్యానికి మించి కేటాయింపులు చేస్తున్నారు. ఇందులో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు, కార్పొరేషన్ మేనేజర్లు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల ప్రమేయం ఉంది. బ్లాక్ లిస్టులో ఉన్న రైస్‌మిల్లులకూ ధాన్యం అప్పగిస్తున్నారు. విచిత్రమేమిటంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నడవకుండా మూతపడిన రైస్‌మిల్లులకు కూడా ధాన్యం ఇచ్చారు. ?అధికారులు, రైస్‌మిల్లర్లు మిలాఖత్ అయిపోయి... టన్నుకు కొంత రేటు కట్టుకొని అడ్డగోలుగా ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో నిర్మాణం కూడా పూర్తికాని రెండు రైస్‌మిల్లులకు 50 వేల నుంచి 60 వేల క్వింటాళ్ల ధాన్యం ఇచ్చేశారు. సూర్యాపేటలో రెండు మిల్లులు రెండేళ్లుగా బియ్యం అప్పగించకపోయినా రూ.100 కోట్లకు పైగా బకాయిలున్నా మళ్లీ గడిచిన యాసంగి సీజన్‌లో ధాన్యం కేటాయింపులు చేశారు.

## ఏపీలో తెలంగాణ మంత్రులు

- ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి
- మంగళగిరిలో పవన్ హెలీప్యాడ్ వినియోగం
- స్వాగతం పలికిన ఎమ్మెల్సీ హరిప్రసాద్



**అమరావతి, ఆగస్టు 10( (అక్షరంన్యూస్)**

ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ మంత్రులు ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేశారు. ఆదివారం హెలీకాప్టర్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి గుంటూరు జిల్లా మంగళగిరి చేరుకున్నారు. ఇందుకోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న హెలీప్యాడ్‌ను వారు ఉపయోగించుకున్నారు. ఈ హెలీప్యాడ్‌ను పవన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులకు పవన్ కల్యాణ్ తరఫున జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. తిరుగు ప్రయాణంలో వారితో పాటు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు.

## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని





**దుగ్గిరాల, ఆగస్టు 10( (అక్షరంన్యూస్)**

రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వృద్ధునికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్వయంగా కట్టుకట్టి తన కాన్వాయ్‌లోని ఓ కారులో ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల సీసీఎల్ ఫ్యాక్టరీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న పెమ్మసాని.. రేవేంద్రపాడు వద్ద రోడ్డు పక్కనే రక్తపు మడుగులో పడి ఉన్న వృద్ధుడిని గమనించారు. వెంటనే కారు నిలిపి వృద్ధుని వద్దకు వెళ్లి స్థానికుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. చినవడ్లపూడికి చెందిన వెల్లా వెంకటేశ్వరరావు మోపెడ్‌పై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. రక్తం కారుతున్న వృద్ధునికి స్వయంగా కట్టుకట్టిన కేంద్ర సహాయ మంత్రి, తన కాన్వాయ్‌లోని ఓ కారులో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.

## నేడు మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన..

➤ మొదటి పేజీ తరువాయి

పవర్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మహాముత్తారం మండలంలో రూ. 2కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీబీవీ జూనియర్ కాలేజ్ భవన ప్రారంభం, అక్కడే పోలారం, కొర్లకుంట, మహబూబ్ పల్లి, నిమ్మగూడెం, ములుగు పల్లి, మాదారం, బోర్ల గూడెం నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, 6 అంగన్వాడీ నూతన భవనాలకు రూ. 70లక్షల సీఆర్ఆర్ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 3.30గం.లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బిఎల్ఎం గార్డెన్ లో మహాముత్తారం, కాటారం, మల్హర్ రావు, మాహదేవ్ పూర్, పలిమెల ఐదు మండలాల రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డు పంపిణీ, 5 మండలాల సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారులకు, మహముత్తారం కళ్యాణ లక్ష్మి చెక్కు లబ్ధిదారులకు పంపిణీ మరియు మేడిగడ్డ ప్రమాదవశాత్తు మరణించిన ఆరుగురికి లక్ష రూపాయల వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం పంపిణీ మంత్రి చేతుల మీదుగా చేయనున్నారు. సాయంత్రం 4.30గం.లకు కాటారం గ్రామ పంచాయతీ పక్కన సీఎస్ ఆర్ రూ. 36లక్షలతో శ్రీపాద చిల్డ్రన్ పార్క్ మరియు ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం, మద్దులపల్లి, ధర్మసాగర్, అంకుసాపూర్, రేగులగూడెం, కాటారంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, 7 అంగన్వాడీ నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 5-00 గంటలకు కాటారం వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ మరియు పాలకవర్గ ప్రమాణ స్వీకారం, సన్మాన (అయ్యప్ప టెంపుల్ కమ్యూనిటీ హాల్ లో ) కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## తెలంగాణాలో వర్షాలు

➤ మొదటి పేజీ తరువాయి

వర్షాల తీవ్రత అంతాస్థాయిలో ఉందని అర్వింద్ కుమార్ వివరించారు.గంటకు 10 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదు అవుతోంది. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి విషమంగా మారుతోంది, అని చెప్పారు.ఈ ఏడాది వర్షాలు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ, ఎనిమిది జిల్లాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయ్యిందని చెప్పారు.అదే సమయంలో ఏడు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నమోదయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లో మాత్రం వర్షం ప్రభావం ఎక్కువగానే ఉందని స్పష్టంచేశారు.అధికారుల సూచన మేరకు ప్రజలు భద్రతపై శ్రద్ధ చూపాలి. లోతట్టు ప్రాంతాల వారు ముందుగానే ఎచ్చరికగా ఉండాలి.జలమయ ప్రాంతాల్లో ప్రయాణం చేయకుండా, ఇంటి వద్దే సురక్షితంగా ఉండడం ఉత్తమం.

## ఎయిర్ ఇండియా ఫ్రీడమ్ సేల్ ఆఫర్


**రూ.1,279కే టికెట్**




**కొచ్చి: ఆగస్టు 10 (అక్షరంన్యూస్)**

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండి యా.. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ సేల్' ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద దేశీయ, అంతర్జాతీయ సర్వీసుల్లో సుమారు 50 లక్షల సీట్లు అందుబాటులో ఉంటాయి. ధర దేశీయ నెట్‌వర్క్‌లో రూ.1,279బీ అంతర్జాతీయ నెట్‌వర్క్‌లో రూ.4279 ఉంటుం ది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ ఆఫర్ కింద బుకింగ్స్ కొనసాగుతాయని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 19 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 మధ్యలో ఈ టికెట్లపై ప్రయాణించే అవకాశం ఉంటుంది.

## మెట్రోలో మంత్రి జూపల్లి ప్రయాణం



**హైదరాబాద్, ఆగ స్టు 10** (అక్షరంన్యూస్)

మంత్రి జూపల్లి కృష్ణారావు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులతో మాట్లాడి సాధకబాధకాలను తెలుసుకున్నారు. ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆదివారం ఉదయం ఎల్‌బీ నగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు మంత్రి జూపల్లి మెట్రోలో ప్రయాణించారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న కూడా మెట్రోలో ప్రయాణించారు.

## కేరళలో ఇంటికే మద్యం డెలివరీ

**రాష్ట్ర బేవరేజెస్ సంస్థ ప్రతిపాదన**

తిరువనంతపురం, ఆగస్టు 10: మందుబాబుల ఇంటికే మద్యాన్ని డెలివరీ చేసే దిశగా కేరళలో కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే మద్యాన్ని సరఫరా చేసేందుకు సంబంధించిన ప్రతిపాదనను ఆ రాష్ట్ర బేవరేజెస్ (మార్కెటింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్) కార్పొరేషన్.. రాష్ట్ర ప్రభుత్వం ముందుంచుంది. దీనివల్ల మద్యం అమ్మకాలతో రాబడి పెరగడానికి, మద్యం విక్రయ దుకాణాల వద్ద రద్దీని తగ్గించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి రాష్ట్ర ఆబ్కారీ చట్టంలో సవరణలు చేయాల్సి ఉంటుంది.

# 20 న జరిగే మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య.**



కరీంనగర్/ జమ్మికుంట/ఆగస్టు 10/అక్షరం న్యూస్:-

ఈనెల 20న బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుబ్బ మల్లన్న ఆలయ ఆవరణంలో హుజురాబాద్ నియోజకవర్గం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పొనగంటి సంపత్ అన్నారు. ఆదివారం జమ్మికుంట మండల కేంద్రంలో మున్నూరు కాపు కుల బాంధవుల సంఘ సమావేశము మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రావణ మాసంలో మున్నూరు కాపు కుల బాంధవులందరూ వనభోజనాల కు వెళ్లడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. ఆ సంఘ జమ్మికుంట పట్టణ,అధ్యక్షులు శ్రీనివాస్ ,తోట లక్ష్మణ్, వీణవంక, ఇల్లందకుంట మండల అధ్యక్షులు చేరాలు, రమేష్, నాయకులు ఆకుల రాజేందర్, సాయిని రవి మాట్లాడారు. రాజకీయ పార్టీలకతీతంగా ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని హుజురాబాద్ జమ్మికుంట, కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట, మండలాల్లో ఉన్నటువంటి మున్నూరు కాపు కుల బాంధవులు తమ కుటుంబ సమేతంగా వనభోజనాలకు విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గ మున్నూరు కాపు కుటుంబ సభ్యులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పొనగంటి సారంగం, పొన్నగంటి మల్లయ్య కాంట్రాక్టర్, ఆకుల రాజయ్య, కడెం జనార్ధన్, కొల కానీ రాజు, కాసర్ల రాములు, పొన్నగంటి రవికుమార్ పిజేఆర్, పొ నగంటి రవీందర్, పొనగంటి కొమరయ్య, ఊడుగుల మహేందర్ ,నీరటి సతీష్, ఆకుల పోచయ్య,ఏ బూషి ఓదెలు, జెమిని సురేష్ ,కడెం సతీష్, శెట్టి ఉదయ భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి కానిస్టేబుల్ ఆత్మహత్య

కరీంనగర్, తిమ్మాపూర్ ఆగష్టు10 (అక్షరం న్యూస్)



తిమ్మాపూర్ మండలం అలుగునూరు శివారులో గత నెల 31న గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించే కరీంనగర్ సుభాష్ నగర్ కు చెందిన కామారపు అనిల్ కుమార్ (36)తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు సన్నిహితులు తిరిగి ఇవ్వకపోగా వేధింపులకు గురిచేయడంతో తీవ్ర మానసిక వేదనకు గురై గతనెల 31న అలుగునూరు శివారులో గడ్డిమందు తాగి ఇంటికి వెళ్లాడు.గమనించిన కుటుంబీకులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించినట్లు మృతుని తండ్రి కామారపు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## మహిళలపట్ల భక్తి, విశ్వాసాన్ని ప్రతిబింబించే పండుగ బోనాలు

- శ్రావణమాస బోనాల పండుగ తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- కొత్తగూడెంలో ఘనంగా శ్రావణమాస బోనాల జాతర



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /10 ఆగష్టు/ అక్షరం న్యూస్ : కొత్తగూడెం మహిళల పట్ల భక్తిని, విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రతిబింబించే పండుగ శ్రావణ మాస బోనాల పండుగ అని, మహిళల ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు అనాదిగా జరుపుకుంటున్న బోనాల పండుగని నేటితరం సైతం రెట్టింపు ఉత్సహంతో ప్రతీఏటా జరుపుకోవడం అభినందనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. శ్రావణమాస బోనాల పండుగ సందర్బంగా ఆదివారం పోచమ్మతల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని లేపాక్షి సెంటర్ నుంచి లక్ష్మీదేవిపల్లి పోచమ్మ తల్లి దేవాలయంవరకు బోనాలతో మహిళలు భారి ర్యాలీ నిర్వహించారు. జాతరను ప్రారంభించిన అనంతరం సాబీర్ పాషా మాట్లాడుతూ మహిళలు ఈ ఉత్సవంలో చూపించే భక్తి, శ్రద్ధ మన సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేస్తుందని, మహిళలు భక్తి శ్రద్దలతో జరుపుకునే ఈ పండుగలు తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. సమాజంలో స్త్రీల భద్రత, గౌరవం, సమానత్వం కోసం మనమందరం కలిసికట్టుగా కృషిచేయాలని, ఈ బోనాల పండుగ ప్రతి ఇంటికి 'సుఖశాంతులు, ఆరోగ్యం, ఆనందం 'తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్లా రాజనర్సు, రాచర్ల శ్యామ్, అభిరాం, కళ్యాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటం తోటి హక్కులు సాధించుకోగలిగాము

### పదవ మహాసభ కార్యక్రమంలో కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి

ఓదెల/ పెద్దపల్లి ఆగస్టు 10(అక్షరం న్యూస్)




ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ 10వ మహాసభ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని దేశాల్లో సిపిఐ పార్టీ ఉన్నదని ఒక దేశానికి సంబంధించిన పార్టీ కాదని దీనికి ప్రపంచంలోనే ఒక ప్రాముఖ్యత ఉన్నదని గతంలో కూడా మనం ఆయుధాలు పట్టి పోరాడిన చరిత్ర ఉన్నదని సాయుధ పోరాటం తోటే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని లేకుంటే పెత్తందారి కబంధ హస్తాలలోనే రాజ్యాధికారం ఉండేదని పల్లెల్లో గ్రామీణ ప్రాంతాల్లో దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ ది భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటం తోటే ఈరోజు దున్నేవాడికే భూమి దక్కిందని లేకుంటే పెత్తందారి చేతుల్లో ఉండేదని అందుకోసము ఎక్కడ అన్యాయం జరిగిన ముందుండి కొట్లాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని దేశంలోనే దీనికి ఒక చరిత్ర ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేక పోరాటం చేయవలసిన అవసరం మళ్లీ ఆసన్నమైందని పల్లె పల్లెల్లో వాడ వాడలో ఎర్రజెండా ఎగర వెయ్యాలని జడ్పిటిసి నుండి వార్డ్ మెంబర్ దాకా ఎర్రజెండా సభ్యులు గెలిచే విధంగా మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా పేదవాడికి కోడి గుడ్డ విద్య వైద్యం అందించడం ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని అదేవిధంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పేదవాళ్లకు నిరుపేదలకు అన్యాయం చేస్తున్నాయని ఎన్నికల ప్రచారంలో అటు కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే కగార్ ఆపరేషన్తో మావోయిస్టులను చంపేస్తామని చెప్పారా వాగ్దానం ఇచ్చారా అని అన్నారు అధికారం రావడంతో ఆపరేషన్ కగారితో ఎంతోమంది మావోయిస్టు పార్టీ దళాలను అన్యాయంగా కాల్చి చంపుతున్నారని ఇది ఎక్కడి న్యాయం అని మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు వస్తామని చెప్పిన కూడా వినకుండా ఒక భయానక వాతావరణం సూచిస్తూ ఒక్కొక్కరిని తీసుకువచ్చి కాల్చి చంపుతున్నారని ఇది ప్రజాస్వామ్యానికి ఒక గొడ్డలి పెట్టు లాంటిదని అన్నారు అదేవిధంగా విప్లవాన్ని పూర్తిగా దేశంలోనే లేకుంటే చేయాలనే ఒక దురాలోచనతో ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయని ఎక్కడ అన్యాయం జరుగుతే అక్కడనే తిరుగుబాటు విప్లవం పుడుతుందని అక్కడనే ఎర్రజెండా ఎగురుతదని హెచ్చరించారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తారని ఎన్నికల సమయంలో చెప్పారని మరి అది మరిచి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పార్టీ కార్యకర్తలకు ఇండ్లు ఇస్తున్నారనే విమర్శ వస్తుందని అన్నారు ఎన్నికల ప్రచార సమయంలో నాయకులు అధికారంలోకి వస్తే మా కార్యకర్తలకి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎక్కడైనా వాగ్దానం చేశారా అలాంటప్పుడు వారి కార్యకర్తలకు ఎలా ఇండ్లు ఇస్తారని నిలదీశారు అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవస్థ కింద బందీలైపోయారని ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే మళ్ళీ సాయుధ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా ఈ మండలంలో అత్యధికంగా భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు ఉన్నారని వారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు అదేవిధంగా అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కలవైన శంకర్ జిల్లా కార్యదర్శి తాంద్ర సదానందం జిల్లా కార్యవర్గ సభ్యులు తార్లపల్లి మల్లయ్య దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్ మరియు నూతనంగా ఎన్నికైన మండల కమిటీ కార్యదర్శి కోడలు స్వామి సహాయ కార్యదర్శిగా తాళ్లపల్లి రమేష్ ఆల శ్రీనివాస్ రెడ్డి పల్లె గట్టయ్య సమ్మెట నాగేందర్ తాళ్లపల్లి కనకరాజు తుమ్మ సదయ్య తో పాటు మహిళా కామ్రేడ్స్ పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ నయీామ్ ఖురేషి పుట్టినరోజు వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / 10 ఆగష్టు / అక్షరం న్యూస్ : రాష్ట్ర మైనార్టీ నాయకులు ఉర్దూగర్ చైర్మన్ డాక్టర్ నయీామ్ ఖురైషి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఓల్డ్ డిపో వద్ద ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.పట్టణ ప్రముఖులు,కార్యకర్తలు, అభిమానులు, మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు విద్యా, వైద్యం, పెళ్లిల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, అనేక మందికి ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారని వివరించారు.అనేక మందికి పెన్షన్లు ఇస్తూ,అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, ఎంతోకాలంగా కాంగ్రెస్ నమ్ముకుని నయీామ్ ఖురేషికి ప్రభుత్వంలో సమచిత స్థానం కల్పించాలని అన్నారు. కార్పొరేషన్ లేదా ఎమ్మెల్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా,టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్,ప్రముఖ వ్యాపారవేత్త కాశీ విశ్వేశ్వరరావు,ఉర్దూఘర్ కార్యదర్శి మొహమ్మద్ షరీఫ్,రంజాన్ ఖాన్, ప్రముఖ సీనియర్ న్యాయవాది ఎం. ఏ. రజాక్, పాషా భాయ్, అంజుమన్ అధ్యక్షులు అమీర్ ఖాద్రి,సీనియర్ జర్నలిస్టు వహాబ్,ఏటియుసి నాయకులు బాబు జానీ ఖాన్,బీఆర్ఎస్ నాయకులు షమీవుద్దీన్, మొహమ్మద్ యాకుబ్ ఖాద్రి, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ సిరాజ్, నిసార్, జమాల్ ,హమీద్,అంకుష్ ఖాద్రి ఫరీద్, ఇబ్రహీం,అష్రఫ్, మొహమ్మద్ ఇక్బాల్,జునేద్ ఆలం ఖురేషి,జుబేద్ ఆలం ఖురేషి,రహీమ్ ఖురేషి (లడ్డూ),జైన్ కఖురేషి రామవరం మదీనా మజీద్ అధ్యక్షులు ఉస్మాన్,కార్యదర్శి అంకుష్,



సయ్యద్ మోయిన్,తదితరులు పాల్గొన్నారు.

# పేదవర్గాలను ఉచిత వైద్యశిబిరం అభినందనీయం

- మారుమూలపల్లెలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువచేయాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- కెసిఓఏ క్లబ్బులో కేర్ ఆస్పత్రుల వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / 10 ఆగష్టు / అక్షరం న్యూస్ : ఏజెన్సీ గ్రామాలకు కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో కేర్ ఆస్పత్రుల యాజమాన్యం ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు, పేదవర్గాలకు వైద్యాన్ని అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని, ఆర్థిక స్తోమత లేని ప్రతి ఒక్కరు వివిధ సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. కేర్ ఆస్పత్రుల యాజమాన్యం వారు పట్టణంలోని కెసిఓఏ క్లబ్బులో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందక, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించే స్తోమత లేక అనారోగ్యంతో తమ జీవితాలను గడుపుతున్నారని, కొందరు ప్రాణాలు వదులుతున్నారని, ఈ పరిస్థితిలో కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు మానవీయకోణంలో పేదలకు వైద్యం అందించేందుకు ముందుకు రావాలన్నారు. వైద్యాన్ని వ్యాపారకోణంలో మలుచుకునే విధానానికి స్వస్తిపలకాలని సూచించారు. కేర్ ఆస్పత్రుల యాజమాన్యం ఆ దిశగా అడుగులువేయడం అభినందనీయమని, ఈసిజి, టూడీ ఏకో, జిఆర్బిఎస్, లిపిడ్ ప్రొఫైల్ తదితర విలువైన సేవలను ఉచితంగా అందించేందుకు ముందుకురావడాన్ని స్వాగతిస్తున్నామని, భవిషత్తులో మరిన్ని సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, శిభిరం కోఆర్డినేటర్ డాక్టర్ వి సూర్యప్రకాశరావు, స్థానిక వైద్యులు నాగరాజు, బిఎస్ఎన్ఎల్ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టిపిసి రామగుండంలో 500 మెగావాట్ల 6వ యూనిట్ లో వార్షిక మరమ్మత్తులు ప్రారంభం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి 2600 మెగా వట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ లోని 500 మెగావాట్ల 6వ యూనిట్ ను వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆదివారం షట్ డౌన్ చేశారు. సుమారు 45 రోజుల పాటు లాంగ్ టర్మ్ వార్షిక మరమ్మత్తులు చేపడతారు. బాయిలర్ టర్బైన్ జనరేటర్ యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ తదితర ముఖ్యమైన విభాగాలన్నిటిని మరమ్మతులు చేస్తారు. ప్రతి ఏటా వార్షిక మరో మత్తుల అనంతరం యూనిట్ యొక్క పనితీరు మెరుగుపడుతుంది. ఈ ఏడాది ఇప్పటికే 2 వందల మెగావాట్ల రెండవ యూనిట్లో వార్షిక మరమ్మత్తులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఎన్టీపీసీ రామగుండంలో 2100 మెగావాట్ల విధి ఉత్పత్తి జరుగుతుంది.

## రైతు బీమా దరఖాస్తులకు ఆహ్వానం

కరీంనగర్, తిమ్మాపూర్ ఆగష్టు 10 (అక్షరం న్యూస్)



రాష్ట్ర ప్రభుత్వం రైతు భీమా పథకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసిందని. ఈ పథకం కింద అర్హులైన రైతులు భీమా ప్రయోజనాలు పొందేందుకు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని తిమ్మాపూర్ మండల వ్యవసాయాధికారి ఎ సురేందర్ తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుబుక్ పొందిన రైతులు తమ దరఖాస్తులను సంబంధిత గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద సమర్పించాలి. ఈ దరఖాస్తులను ఆగస్టు 13 వరకు సమర్పించాలన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సున్న రైతులు అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్, నామినేషన్ ఫారమ్ పై రైతు సంతకం, రైతులు ఈ పత్రాలను సక్రమంగా సిద్ధం చేసి, సమయానికి తమ గ్రామ విస్తరణాధికారులకు అందజేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 1%వా%: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని 1 నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న 9వేల 191 మంది బాలబాలికలకు ఈ నెల 11(సోమవారం)న ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడానికి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మా త్రలను వేసుకోవాలని సూచించారు. మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకుని నులిపురుగుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని అన్నారు

## ధర్మస్థల వ్యవహారంలో కానరాని పురోగతి

- **చూపిన చోటల్లా తవ్వుతున్నా బయటపడని ఆనవాళ్లు**

బెంగళూరు,ఆగస్ట్10 ధర్మస్థలలో సిట్ దర్యాప్తు ఒకవైపు, తవ్వకాలు మరోవైపు కొనసాగు తున్నాయి. అయితే ఆధారాలు పెద్దగా లభించడం లేదు. తవ్వకాలు, తమకు దొరికిన ఎముకలు, ఇతర అవశేషాలకు సంబంధించి సిట్ అధికారులు వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. తవ్వకాలు చేస్తున్న చోటు-కు ఉప్పుమూటల్ని తీసుకువెళుతున్నారు. దొరికిన వాటిని సంచుల్లో ఉంచుకుని, వాటికి తెల్లవస్త్రాన్ని చుట్టి తీసుకువెళుతున్నారు. బెళ్తంగడి సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మణిపాల్ కేఎంసీకి పంపిస్తున్నారు. మణిపాల్ నుంచి బెంగళూరులోని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు ఆయా సంచులను చేరవేస్తున్న ఘట్టం నిగూఢంగా సాగుతోంది. ధర్మస్థలలో సిట్ చేపట్టిన కార్యాచరణకు, తమకు సంబంధాన్ని అంటగడుతూ కొన్ని ప్రచార మాధ్యమాలు, యూట్యూబర్లు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆలయ ప్రముఖుడు హర్షేంద్రకుమార్ హెగ్గడే వేసుకున్న అర్జీని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నిస్తూ ధర్మస్థల కార్యదర్శి హర్షేంద్ర కుమార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రచార మాధ్యమాలను నియంత్రించాలని పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని పీఠం అనుమానాన్ని వ్యక్తం చేసింది. మీమ్‌లు, అభ్యంతరకరమైన అంశాలపై కర్ణాటకలోని న్యాయస్థానంలో అర్జీ వేసుకోవాలన్నారు. మీకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయవలసిన అవసరం మాధ్యమ ప్రతినిధులకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇకపోతే తాను వందలాది శవాలను పూడ్చి పెట్టానని ప్రకటించిన ఒకప్పటి పారిశుధ్య కార్మికుడు భీమ సహకారంతో ప్రత్యేక దర్యాప్తు దళం సిట్ తవ్వకాలను కొనసాగిస్తోంది. అయిత అక్కడ పెద్దగా ఎలాంటి శవాల ఆనావాళ్లు కానరావడం లేదు. మొదట 13 ప్రాంతాలు, అనంతరం ఒక కొత్త ప్రదేశంతో పాటు, మరో మూడు ప్రాంతాలను ఆ వ్యక్తి చూపించాడు. వాటిలో మొదటి 12 ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తిచేయగా, ఆరో ప్రాంతంలో మాత్రమే ఎముకలు లభించాయి. మరో చోట ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. 13వ ప్రాంతంలో తాను ఎనిమిదికిపైగా మృతదేహాలను పూడ్చి పెట్టానని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. ఆ ప్రాంతాన్ని కాదని.. గురువారం కొత్తగా గుర్తించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఏమీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమను సిట్ అధికారులు విచారించారు. అతను కొత్తగా చూపించిన మూడు ప్రాంతాల్లో ఒక చోట సాయంత్రం వరకు తవ్వారు. అయినా తాను మరో 30 ప్రాంతాలను చూపిస్తానని, అక్కడ తవ్వకాలు చేయాలని కోరాడు. జీపీఆర్ కోసం...: భీమ చూపించిన 13వ ప్రాంతంలో తవ్వకాలకు ముందస్తుగా జీపీఆర్ పరికరాన్ని వినియోగించి తవ్వకాలు కొనసాగించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకోవలసిన అవసరం ఉండడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు సాగలేదు. ఎవరూ అక్కడకు రాకుండా సాయుధదళాన్ని భద్రతకు నియమించారు.

# ప్రతి గ్రామాన అభివృద్ధి గడపగడపకు సంక్షేమ ఫలాలు

- **మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..**
- **ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నాం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించండి**
- **పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



పెద్దపల్లి రూరల్ ఆగష్టు 10 అక్షరం న్యూస్

పెద్దపల్లి మండలం అప్పన్నపేట బొంపల్లి మేరపల్లి గ్రామాల్లో ఆదివారం రూ.1 కోటి 10 లక్షల నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల తోపాటు మహిళా సంఘ భవనం అప్పన్నపేటలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించారు ఎమ్మెల్యే విజయరమణారావు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కొత్తగా రేషన్ కార్డులు మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ రూ.5వందలకే గ్యాస్ సిలిండర్ రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షల పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోలు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇసుక సులభతరం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముంగిటకు తీసుకు వచ్చినట్టు చెప్పారు ప్రతి కుటుంబానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు మరోవైపు గ్రామ గ్రామాన ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. తమ సేవలను గుర్తించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను, కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అరె సంతోష్, సందవేణి రాజేందర్, చింతపండు సంపత్, కాలబోయిన మహేందర్,నుగుల్లా మల్లయ్య,ఏడ్లి శెంకర్,బొంకురి అవినాష్,ముత్యాల నరేష్,జెడల రాజు,వేరేశం, రాజు,శ్రీనివాస్,శ్రీకాంత్ శ్రీనివాస్, నరేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం



న్యూఢిల్లీ, ఆగష్టు 10 (అక్షరం న్యూస్)

గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదుపాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు ఆవడం ఇప్పటికీ ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఎపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క అడవిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, -టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు. షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు. విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు నోచుకోలేదు. ఆదివాసీలను భూముల నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి.

గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనుల సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే పక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఎన్ఇన హామీలు ఇచ్చినా గిరిజన సంక్షేమం నెరవేరదని పాలకులు గుర్తించాలి. కనీస సౌకర్యల కల్పన విద్యవిద్యం వంటి విషయాల్లో అడుగులు పడాలి.

## దేశంలో ఊపందుకున్న ట్రంప్ వ్యతిరేక ప్రచారం

- **అమెరికా ఉత్పత్తులు బ్యాన్ చేయాలన్న డిమాండ్**
- **ఎక్స్ వేదికగా కోకాకోలా, పిజ్జా, కెఎఫ్‌సిల బహిష్కరణ ఉద్యమం**

న్యూఢిల్లీ,ఆగస్ట్10(అక్షరం న్యూస్)

ట్రంప్ తీరుపై ఆగ్రహంతో ఉన్న భారతీయులు ఆయనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న స్థాయికి ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక భారత్‌లోనే కాదు...ప్రపంచ వ్యవప్తంగా వస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సొంత దేశంతో పాటు అంతటా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపెయిన్లలో భాగస్వాములవుతున్నారు. 1500కు పైగా పోస్టులు 'ట్రంప్ ఈజ్ అన్‌ఫిట్ ఫర్ ఆఫీస్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో, 'అరెస్ట్ ట్రంప్' అనే హ్యాష్‌ట్యాగ్, కీలక పదాలతో కూడిన పోస్టులు 1900 ఉన్నాయి. దాదాపు 300 మంది నెటిజన్లు వ్యక్తిగత దూషణలు, అవమానపర్చే పదాలతో 3000కు పైగా పోస్టులు చేశారు. అమెరికా అధ్యక్షుడిని టార్గెట్ చేసుకుంటూ ఇలాంటి పదాలను వినియోగించే ధోరణి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా ఉత్పత్తులు, వ్యాపారాలను బహిష్కరిం చాలంటూ భారత్ నుంచి విస్తృతస్థాయిలో పిలుపులు రావటం బహుశా ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెప్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిపై భారతీయుల్లో వ్యతిరేకత పెరిగిపోతున్నది. భారత్‌తో పాటు-ఇతర దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్న ఆయన తీరును వారు తప్పుబడుతున్నారు. ఒకప్పుడు ట్రంప్‌నకు మద్దతిచ్చినవారు, అమెరికాకు ఆయనే మళ్లీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారు సైతం ఇప్పుడు ఆయన వద్దంటే వద్దు అని తెగేసి చెప్తున్నారు.

# నగరపాలక సంస్థలో సెలవు రోజు కూడా రెవెన్యూ మేళా



**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

వంద రోజుల కార్యాచరణ లో భాగంగా ఆదివారం రామగుండం నగర పాలక సంస్థ కార్యలయంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. ఇంటి పన్ను పునః సమీక్షించి తగ్గించాలని, యజమాని పేరు సవరణ చేయాలని పలువురు ధరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ రావు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. రామగుండం నగరపాలక సంస్థలు వందరోజుల కార్యచరణ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది.

# ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో నూతన వస్త్రాలు పంపిణీ



**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

ఈశ్వర కృప వృద్ధాశ్రమాన్ని ఆదివారం భారత ప్రభుత్వ అడవులు, వాతావరణం మార్పుల సంయుక్త కార్యదర్శి శరత్ కుమార్ పల్లెర్ల సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ చేసిన తర్వాత శరత్ కుమార్ మాట్లాడుతూ ఈశ్వర కృప వృద్ధాశ్రమము ఆహ్లాదకరమైన వాతావరణం లో వృద్ధులకు ఆహార సంరక్షణ మరియు మంచి వసతిని అందజేస్తుందని నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆశ్రమా అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వము నుండి మరియు ప్రభుత్వ రంగ సంస్థల నుండి ఆశ్రమ వాసులకు కనీస కొరత లేకుండా వారు సహాయపడేటట్టు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కంపెనీ ఏజెంటు చిలుక శ్రీనివాస్, ఎన్ టి పి సి ఎస్సై లచ్చన్న మరియు ఆశ్రమ డైరెక్టర్లు గంట సత్తయ్య, మాధవరెడ్డి, సుంక లింగమూర్తి లక్ష్మీరాజం, బట్టల వెంకటయ్య, జాకా సత్యనారాయణ కోటగిరి శ్రీనివాసరావు సలహాదారుడు అలుగువెల్లి సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో కానిస్టేబుల్ ఆత్మహత్య



పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 10 అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లాలో ఆదివారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. గడ్డి మందు తాగి ఓ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. తెలిసిన సమాచారం ప్రకారం.... పెద్దపల్లి డీసీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అనిల్ అనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిది స్వగ్రామం కరీంనగర్. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కానిస్టేబుల్ మరణానికి కారణాలు తెలియ రాలేదు.

# క్రిమిసంహారక మందు త్రాగి వ్యక్తి మృతి



**మహబూబాబాద్/కేసముద్రం /ఆగస్టు 10/అక్షరం న్యూస్ :-**

క్రిమిసంహారక మందు త్రాగి వ్యక్తి మృతి చెందిన ఘటన తాళ్లపూసల పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కేసముద్రం ఎస్ఐ మురళి దర్ రాజు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి .తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన వలసాని మురళి తండ్రి ఐలయ్య, 39 సం,లు కులం (యాదవ,)కూలి, అను వ్యక్తి గత కొంతకాలంగా మధ్యానికి బానిసై తరచు తన భార్య రేణుక తో గొడవ పడుతూ చనిపోతాను అని బెదిరించే వాడు అని శనివారం మురళి వాళ్ళ అక్క వచ్చి రాఖీ కట్టిన అనంతరం మురళీ యొక్క భార్య రేణుక తన తల్లి వారింటికి రాఖి కట్టడానికి వెళ్ళినది. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మురళి బాగా మద్యం సేవించి మద్యం మత్తులో గ్రామ శివారులోనీ చెరువు కట్ట వద్ద గల మల్లన్న గుడి వద్ద శనివారం ఉదయం 11.00 గంటలకు గడ్డి మందు త్రాగి పడిపోగా కాలేరు వెంకన్న చూసి మురళి యొక్క అన్న యాకన్నకు ఫోన్ చేసి చెప్పగా వారు వెంటనే 108 అంబులెన్స్ లో మహబూబాబాద్ ఆసుపత్రి కు తీసుకెళ్లి, అక్కడి నుండి ఎంజీఎం వరంగల్ కి తీసుకువెళ్లి చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11.00 గంటలకు చనిపోయినాడు అనీ మురళి యొక్క అన్న యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనైనది. అని కేసముద్రం ఎస్ఐ మురళీధర్ రాజ్ ఈ సందర్భంగా తెలిపారు.

# అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ

## తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా చల్లా రవీందర్ రెడ్డి, పి ఆర్వో గా జనగామ తిరుపతి

**జ్యోతి నగర్ ఎన్టిపిసి, 10 ఆగస్టు : పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ ప్రధాన కార్యదర్శి భేతి తిరుమల్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా చల్లా రవీందర్ రెడ్డి ని, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గా జనగామ తిరుపతి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బేతి తిరుమల్ రావు మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సంస్థకు చల్లా రవీందర్ రెడ్డి మరియు జనగామ తిరుపతి సేవలు చాలా ముఖ్యమని మంచి సామాజిక సేవాపరులని అనేక అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందిని భక్తి మార్గంలోకి తీసుకొచ్చిన వ్యక్తులు అని కొనియాడారు ఈ సందర్భంగా చల్లా రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా నియమించిన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ వ్యవస్థాపకులు పీఆర్ మీనన్ కి జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్ కి ప్రధాన కార్యదర్శి భేతీ తిరుమలరావు కి కోశాధికారి వంశీకృష్ణ కి రెండు రాష్ట్రాల కన్వీనర్ రాచర్ల రమేష్ కి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లం రాజు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు గంగాధర్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్ రావు రమేష్ ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భాస్కర్ కోశాధికారి రమేష్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ జనగామ తిరుపతి, భూతం రాజేష్ తో పాటు వివిధ జిల్లాల నుండి వచ్చిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు





# రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోండి

## ..... మండల వ్యవసాయ అధికారి ప్రకాష్

**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

కొత్తగా పట్టాదారు పాసుబుక్కు లు పొందిన రైతులతో పాటు ఇప్పటివరకు రైతు బీమా చేసుకొని రైతులందరూ ఈ నెల 13వ తేదీ వరకు రైతు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని రామగుండం వ్యవసాయ అధికారి ప్రకాష్ కోరారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ రైతుల కోసం బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. జూన్ 5వ తేదీ వరకు పట్టాదారు పాసుబుక్కులు పొందిన రైతులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని అన్నారు 18 నుండి 59 సంవత్సరాల వయసుగల రైతులు అర్హులని అన్నారు, రైతు బీమా చేసుకునే రైతులు దరఖాస్తు ఫారం,రైతు పట్టాదారు పాసు బుక్కు జిరాక్స్ కాపీ, రైతు ఆధార్ కార్డు మరియు నామిని ఆధార్ కార్డులతో రామగుండం వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈనెల 13వ తేదీలలోగ అందజేయాలని కోరారు

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/(, అక్షరం న్యూస్) ఆగస్టు 10:**

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని భాంజీపేట గ్రామానికి చెందిన చాట్ల వెంకటయ్య (53) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మద్యానికి బానిసైన చాట్ల వెంకటయ్య శనివారం అతిగా మద్యం సేవించి తాగిన మైకంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నరేష్ తెలిపారు.

# ఆదివాసీ విద్యార్థులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం/ చర్ల ఆగస్టు 10/ అక్షరం న్యూస్/**

మండల కేంద్రం లోని వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీమ్ విద్యార్ధి నిలయం నందు విద్యనభ్యాసిస్తున్న గిరిజన విద్యార్థులకు హైదరాబాద్ వాస్తవ్యులు తుమ్మలపల్లి స్ఫూర్తి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చి ఎంతో పట్టుదలతో విద్యాభ్యాసిస్తున్న గిరి సోదరులకు రాఖీ కట్టడం ఆనందించదగ్గ విషయం అని ఆ చిన్నారి అన్నారు.నేను నీకు రక్షా నీవు నాకు రక్షా మనిద్దరం దేశానికి రక్షా అంటూ అతి పిన్న వయసులోనే సేవా గుణాన్ని ప్రదర్శించన స్ఫూర్తి నీ నిలయ కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. గోగుబాక గ్రామానికి చెందిన సాగి వెంకట జగన్నాదరాజు (నానిబాబు రాజు) విద్యార్దులకు రూ. రెండు వేలు విలువ చేసే యాపిల్స్ బత్తాయి దానిమ్మ, అరటిపండ్లను అందచేశారు. వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత వియ్యంకులు ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా పలమనేరు కు చెందిన గుది వెంకట్రావు శ్రీవిద్య దంపతులు విద్యార్దులకు బొప్పాయి అరటిపండ్లు చాక్లెట్లు లను పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలకు నిలయ కమిటీ సభ్యులు హృదయ పూర్వక మైన కృతజ్ఞతాభిమానాలు తెలియజేశారు.





# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఆగస్టు 10:**

ప్రభుత్వ అనుమతులు లేకుండా కుందారం వాగు నుండి బాంజీపేటకు అక్రమం ఇసుక తరలిస్తున్న కుందారం గ్రామానికి చెందిన ఓరుగంటి చిరంజీవి ట్రాక్టర్ ను పోలీసులు ఆదివారం పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమంగా ట్రాక్టర్ లో ఇసుక తరలిస్తున్న ఓరుగంటి చిరంజీవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డినరేష్ తెలిపారు.

# ఎన్టిపిసి సిహెచ్ పి ఉద్యోగులకు సన్మానం





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎన్టిపిసి ప్రాజెక్ట్ సిహెచ్ పి డిపార్ట్మెంట్లో చేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు పదోన్నతి లభించడంతో బిఎంఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. సిహెచ్ పి ఆపరేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులు పల్లెర్ల సత్యనారాయణ నరకుల్ల బాలసుబ్రమణ్యం శ్రీకాంత్ ఎం హరివర్ధన్ లు పదోన్నతి పొందడం పట్ల బి ఎం ఎస్ నాయకులు గొల్లూరి పురుషోత్తం లెక్కల పవన్ ఎండి అన్వర్ తదితరులు శాలువాతో సన్మానించారు

# ఘనంగా వెంకటగిరిలో బోనాల పండుగ

## ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మార్కెట్ చైర్మన్ మచ్రి నారాయణరావు దంపతులు



**మహబూబాబాద్ /కేసముద్రం /ఆగస్టు 10/అక్షరం న్యూస్ :-**

శ్రావణ మాస బోనాలలో భాగంగా కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామంలో బద్ది పోచమ్మ అమ్మవారికీ బోనాల పండుగ మాజీ మార్కెట్ చైర్మన్ మచ్రి నారాయణ రావు, శోభమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా బద్ది పోచమ్మ తల్లికి గ్రామంలోని మహిళాలు, పెద్దలు, చిన్నలు బోనాలతో యటపోతులతో తరలి వచ్చి అమ్మవారికి నైవేజ్యం సమర్పించుకొని యాటపోతులను బలి ఇచ్చి భక్తి శ్రద్దలతోకొలిచారు. ఈసందర్భంగా మాజీ చైర్మన్ నారాయణరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు వుండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,అష్టైశర్యాలతో తులాతుగాలని అమ్మవాని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్రి వెంకటరావు,పల్లెర్ల ప్రమీల, దుండి మధుకర్,చోళ్ళేటి సత్యనారాయణ,డీలర్ వేంకటాద్రి,కంచ గౌరయ్య, మంగ యకాయ్య,మాజీ సర్పంచ్ గాండ్ల వెంకన్న,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రెడ్డి గాండ్ల వారికి బీసీ బి 6 సర్టిఫికెట్లు ఇవ్వద్దు..

## బీసీ బి కులాల హక్కులను రక్షించాలి - జక్కం మారుతి



**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

గాండ్ల రెడ్డి కులస్తులకు బిసి బి 6 సర్టిఫికెట్లు జారీ చేయకూడదనితెలంగాణ రాష్ట్ర గాండ్ల కుల వృత్తి నూనె ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జక్కం మారుతి పత్రికా ప్రకటనలో తెలిపారు. గతంలో రద్దయిన బీసీ బి%-%6 సర్టిఫికెట్లను తిరిగి పొందేందుకు కొంతమంది రెడ్డి గాండ్లవారుగా చెప్పుకుంటున్న ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూపాల్‌పల్లి జిల్లా కాటారంలో నిర్వహించిన సమావేశంలో, మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కలసి, బీసీ బి%-%6లో చేర్చాలని కోరిన విషయం ఆందోళనకరమని ఆయన అన్నారు. ఇది ఒకే కులానికి సంబంధించిన సమస్య కాదు, బీసీ బి గ్రూపులోని అన్ని కులాల హక్కులకు భంగం కలిగించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. గతంలో కూడా ఇదే అంశంపై జస్టిస్ ధాల్వాసుబ్రహ్మణ్యం కమిషన్ విచారణ జరిపి, వారు గాండ్ల కులానికి చెందరని తేల్చిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా, తదనంతరం ఉత్తర్వులు రద్దయినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ ఆ సర్టిఫికెట్ల కోసం చేస్తున్న ప్రయత్నాలను అన్ని బీసీ కులాలు ఏకమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

# పోచమ్మ తల్లి.. చల్లగా చూడమ్మా..

**తెలంగాణ సంస్కృతిక ప్రతీక బోనాలు**

**గ్రామదేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో భాగం**

**కేసముద్రం మండలంలోని ఆయా గ్రామాలలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలు**



**మహబూబాబాద్ /కేసముద్రం /ఆగస్టు 10/అక్షరం న్యూస్ :**

-కేసముద్రం స్టేషన్ మున్సిపాలిటీ పరిధితో పాటు మండలంలోని నారాయణపురం,కల్వల గ్రామపంచాయతీలలో బోనాల ఉత్సవాల సంబరాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక ప్రతీక బోనాలు సకల జనులు సుఖశాంతులతో ఉండాలని కోరుకునే ప్రజల ఇష్టమైన పండుగ బోనాల పండుగ తెలంగాణ సాంప్రదాయ ప్రతీక బోనాల పండుగ అధిక శ్రావణ మాస ఆశ్లేష కార్తెలో గ్రామదేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో భాగంగా ఆయా గ్రామాలలో ఆదివారం నాడు భక్తిశ్రద్ధలతో ఆడపడుచులు తలపై బోనంఎత్తి మన శరీరం బోనపు కుండకు ప్రతీక అనుకుంటే కుండలోని అన్నం జీవ శక్తికి సంకేతం బోనం కుండపై వెలిగే దీపంఆత్మజ్యోతిని పరంజ్యోతితో మమేకం చేయాలన్నది బోనాల సంబరాల అంతర్యంగా భావించి ముత్యాలమ్మ తల్లి అమ్మవారి దేవాలయాలకు చేరుకొని అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల విశ్వబ్రహ్మణ కులస్తులు ,మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసీలు,మాజీ వార్డు సభ్యులు, గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శేషగిరి భవన్ లో గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి ప్రెస్ మీట్

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మరియు జనరల్ సెక్రటరీ కొరిమి రాజకుమార్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / 10 ఆగష్టు / అక్షరం న్యూస్ :**

కొత్తగూడెం శేషగిరిభవన్ లో ఆదివారం ఉదయం కార్మికుల సమస్యల పై గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మరియు జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ ప్రెస్ మీట్ నిర్వహించారు,అనంతరం కార్మిక సమస్యల పై మీడియా తో అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్ కోసం సంస్థ అధికారులు దృష్టి పెట్టి 1/70 యాక్ట్ లో ఉన్న కోయగూడెం ఓసి ,గోదావరిఖని లోని తాడిచర్ల 2, భూపాలపల్లి లోని వెంకటాపూర్ ఓసీ, సత్తుపల్లి ఓసీ 3 లలో బొగ్గును ప్రైవేటు వారికి ఇవ్వకుండా సింగరేణి నే తీయాలి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. యాజమాన్యం ఈ విషయం మీద వెంటనే నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణి లో జరుగుతున్న కుంభకోణాల మీద విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టకపోవడం పట్ల గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు తీవ్రంగా మండిపడ్డారు ప్రభుత్వ జోక్యం వల్ల ఎక్స్ప్లోజివ్ టెండర్ ల లో సుమారు సింగరేణి సంస్థ కు 450కోట్ల నష్టం జరిగిందనీ అదే విధంగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ లో అనేక కుంభకోణాలకు పాల్పడుతున్న అవినీతి అధికారుల మీద వెంటనే చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్న యాజమాన్యం సాధారణ ఉద్యోగులు చేసే చిన్న చిన్న పొరపాట్ల మీద వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు అధికారులకు ఒక న్యాయం కార్మికులకు ఒక న్యాయం ఉండరాదని స్పష్టం చేశారు. సంస్థ సి%ఎం%డి మరియు డైరెక్టర్ ల స్ట్రక్చర్ సమావేశం లో ఒప్పుకున్న పలు కార్మిక సమస్యల పై వెంటనే సర్క్యులర్ లు యాజమాన్యం విడుదల చెయ్యాలి అని డిమాండ్ చేశారు. అదేవిధంగా మైనింగ్ మరియు ట్రేడ్స్ మెన్ ఉద్యోగులు మెడికల్ అన్ఫిట్ అయితే వారికి సర్ఫేస్ లో సుటబుల్ జాబ్ ఇవ్వాలని మరియు ఈపి ఆపరేటర్లకు డి నుండి సీ, సీ నుండి బీ గ్రేడ్ ఉద్యోగులకు వెకెన్సీస్ తో సంబంధం లేకుండా ప్రమోషన్ లు ఇవ్వాలని అదేవిధంగా మారుపేర్ల విషయం పై అడ్వకేట్ జనరల్ దగ్గర ఉన్నందున యాజమాన్యం మారు పేర్ల సమస్యని వెంటనే పరిష్కారం అయ్యేవిధంగా ప్రభుత్వం తో పాటు అడ్వకేట్ జనరల్ ను సంప్రదించి సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేవిధంగా చూడాలనీ డిమాండ్ చేశారు. మొన్న జరిగిన మెడికల్ బోర్డు లో 55 మంది బోర్డుకు హాజరవ్వగా ఐదుగురు మాత్రమే అన్ఫిట్ చేశారు అని మిగిలిన 50 మందికి మళ్ళీ మెడికల్ బోర్డు పెట్టాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ట్రాన్స్కో జెన్కో లు సింగరేణి బొగ్గును కొని ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా పోవడం వల్ల సుమారు 36వేల కోట్లు మొండి బకాయిలుగా మారాయని ప్రభుత్వం వెంటనే చెల్లించకపోతే లేని ఎఐటియుసి కార్మిక గుర్తింపు సంఘం గా ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు.యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్ మాట్లాడుతూ కార్మికులకు వెంటనే 200 గజాల స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి కోల్ ఇండియా తరహా లో వివిధంగా అయితే వడ్డీ లేని రుణం 30లక్షలు మంజూరు చేస్తుందో అదే విధంగా సింగరేణి కార్మికుడికి కూడా రుణం కల్పించి సొంత ఇంటికల నెరవేర్చాలి అని డిమాండ్ చేశారు. గడిచిన ఫైనాన్షియల్ సంవత్సరం లో అసలు లాభాలు ఎంత వచ్చాయో స్పష్టంగా తెలిపి వాస్తవ లాభాల పై 35శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్లరికల్ ఖాళీలు అర్హులైన అంతర్గత అభ్యర్థులతో వెంటనే భర్తీ చెయ్యాలి అని కోరారు,

ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరాస్వామి, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, కత్తర రాములు, సందేబోయిన శ్రీనివాస్, హుమాయూన్, మీడియా ఇంచార్జి కమల్,రాము,సాంబమూర్తి, మధుకృష్ణ, మద్రిగోపి,మండల రాజేశ్వరరావు,కోటి, ఏం ఆర్ కె ప్రసాద్, గోపి,తిరుపతి, రాంశంకర్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) ఆగస్టు 10 అక్షరం న్యూస్:**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మేడగొండ. కొమరమ్మ నూతన గృహ నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సందెవేన. కుమార్, జక్కుల ఆశాలు, పెంచాలా అభిలాష్,ఎలుక కుమార్, జక్కుల అజయ్, మేడగొండ.ఉస్సయ్య, ఎలుక కుమార్, సిరిపురం రాకేష్, మేడగొండ.కత్తి మహేష్, మేడకొండ మధుకర్,జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోదారిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ సర్కార్ ది

## ఎండిన గోదారిలో ఆటాలాడి బిఆర్ఎస్ శ్రేణుల నిరసన


**జ్యోతి నగర్ ఎన్టిపి సి ఆగస్టు 10 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**





తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రైతాంగానికి సాగునీరు ఈ ప్రాంతానికి త్రాగునీరు అందించాలన్న మహా సంకల్పం తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి గోదావరి నదిని నిండుకుండలా మార్చి రైతుల కన్నీళ్లు తుడిచారని... 20 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించక రైతుల కంట కన్నీరు పెట్టిస్తూ రేవంత్ సర్కార్ అరిగోస పెడుతుందని... గోదావరి నదిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ గారు అన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలోగోదావరిఖని పట్టణ శివారు గోదావరి నది ఇసుక లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇసుకలో బీఆర్ఎస్ నాయకులు క్రికెట్, ఖోఖో, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ పాలనలోకేసీఆర్ సీఎం గా కొనసాగిన సమయంలో గోదావరి నిండుకుండలా ఉండేదని కాంగ్రెస్ సర్కారు గద్దెనెక్కిన తర్వాత నిండుకుండలా ఉన్న గోదావరి ఎడారిలా మారిందన్నారు. తాము ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో నిండుకుండలాగా ఉన్న గోదారినదిలో పడవల పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. గతంలో పారే గోదావరి నది కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు ప్రజలకు సాగు, తాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను, రైతులను నమ్మించి ఎన్నికల్లో గెలిచాక ప్రజలను నట్టేట ముంచరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు ఫిల్లర్లు కుంగితే మరమత్తులు చెయకుండా రేవంత్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై కేసీఆర్ గారిపై అక్కసుతో రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నరన్నారు. పంటలు ఎండిపోకుండా ఇప్పటికైనా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కన్నెపల్లి పంప్ హౌజ్ ను నుండి నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణ వేణీ , గాదం విజయ బాద అంజలి టిబిజికెఎస్ నాయకులు పర్లపల్లి రవి నూనె కొమురయ్య వడ్డెపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అచ్చే వేణు తోకల రమేష్ చెలకలపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి కల్వ శ్రీనివాస్ పీచర శ్రీనివాస్ జక్కుల తిరుపతి అల్లం అయిలయ్యకేశవ గౌడ్ ఐరుగురాళ్ల శ్రావన్ చింటూ సట్టు శ్రీనివాస్ కలవేని రవీందర్ భాను చందర్ నూతి తిరుపతి గంపుల లక్ష్మి అర్జునపల్లి శ్రీనివాస్ బండారి ప్రవీన్గుర్రం పద్మ సూజాత లక్ష్మి బుర్ర వెంకటేష్ ఆవునూరి వెంకటేష్ కిరన్ జీ తదితరులు పాల్గొన్నారు

# కేబీఆర్ పార్కు చుట్టూ రెండు ప్యాకేజీలుగా పనులు




**హైదరాబాద్ అక్షరం న్యూస్:**
రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం చేపట్టిన 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)' ప్రాజెక్టుల్లో కీలక అడుగు పడింది. కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ వంతెనలు, అండర్‌పాసల నిర్మాణానికి మూడు సంస్థలు ముందుకు వచ్చాయి. రూ.580 కోట్లతో ప్యాకేజీ-1లో భాగంగా జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం, ముగ్ధ జంక్షన్ల వద్దబీ రూ.510 కోట్లతో ప్యాకేజీ-2లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నంబరు-45, ఫిల్మ్‌నగర్, మహారాజ అగ్రసేన్, క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ల వద్ద ప్రాజెక్టుల కోసం ఫిబ్రవరి 22న జీహెచ్ఎంసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం సాయంత్రం గడువు ముగియగా.. బల్దియా అధికారులు టెండర్ బాక్స్ తెరిచారు. ఎం.వెంకట్‌రావు(ఎంవీఆర్), మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) బిడ్ వేశాయి.సాంకేతిక, ప్రైస్ బిడ్ పరిశీలన ప్రారంభమైంది. కాగా, సాంకే తికంగా ఆయా సంస్థలకు ప్రాజెక్టులు నిర్మించే అర్హత ఉందా..? అన్నది మొదట పరిశీలించనున్నారు. అనంతరం అర్హత ఉన్న సంస్థల్లో తక్కువ కోట్ చేసిన రెండు సంస్థలను ఎంపిక చేసి.. కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ)కు పంపుతారు. సీవోటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత వివరాలు ప్రభు త్వానికి వెళ్తాయి. సర్కారు ఆమోదం అనంతరం ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు నెలన్నర నుంచి రెండు నెలలు పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ లోపు పార్కు చుట్టూ ఆస్తుల సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది.

# నాలుగు బోర్లున్నా ట్యాంకర్ నీళ్లే దిక్కు..

## పంటను కాపాడుకునేందుకు రైతన్న కష్టాలు



**రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన రైతు ఇటికాల వెంకట్‌రెడ్డి తన పంటను కాపాడుకునేందుకు నిత్యం నానా అవస్థలు పడుతున్నాడు. తన పొలంలో నాలుగు బోర్లున్నపట్టికి తన సాగు ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు బోర్లలో ఇప్పటికే ఇటివల కాలంలోనే మూడు బోర్లు పూర్తిగా వట్టి పోయినవి. ఒక బోరు మాత్రం ఆపుతూ అంతంత మాత్రంగానే పోస్తున్నది. తనకున్న 12 ఎకరాల పొలానికిగాను పంటకు నీరందుతుందో లేదోననే సందేహంతో 6 ఎకరాల పొలంలో యాసంగిలో వరిపంటను సాగు చేశాడు. మొదట్లో పంట బాగానే ఉన్నప్పటికి మండలంలో నెలకొన్న కరువులో భాగంగా ఇటివలే అతని బోర్లు అడుగంటి పోయాయి. ఉన్న ఒక్క బోరుతో పంట తడారకపోవడంతో మండుతున్న ఎండలకు క్రమంగా ఎండి పోవడం మొదలైంది. దీంతో రైతు చేసేదేమిలేక కళ్లముందు ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు సాహసం చేశాడు. ఒక్కో ట్యాంకరు నీటికి రూ.1000 ఖర్చు చేసి నీటి ట్యాంకర్ ద్వారా పంట చేనుకు నీరందించడం మొదలు పెట్టాడు. చేతి కొచ్చిన పంటను పొట్ట దశలో ఎండి పోకుండా రోజుకు నాలుగైదు వేలు ఖర్చు చేసి పంటకు నీరందిస్తున్నాడు.

అయినప్పటికి ఒకవైపు నీరు పెడుతుంటే మరో వైపు పంట ఎండు ముఖం పడుతున్నది. దీంతో చేసేదేమిలేక వెంటక్‌రెడ్డి ఆందోళన చెందుతున్నాడు. పంట పూర్తిగా ఎండిపోతే పశువుల పాలు కాక తప్పదని వాపోతున్నాడు. వేలాది రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పదేళ్ల కాలంలో ఎన్నడు ఇంతటి కరువును చూడలేదని ఈ సారి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నాడు. గత పదేళ్లు చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాయని ప్రస్తుతం ఎండిపోవడంతో భూగర్భ జలాలలు అడుగంటి రైతులకు సాగునీటి కష్టాలు వచ్చినట్లు పేర్కొన్నారు. పంటలు ఎండిపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో పంటలెండి పోతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం కన్నెత్తి చూడటంలేదని వాపోతున్నాడు. పంటలెండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. రైతులకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నాడు. ఇలాంటి ఘటనలు మండలంలో కోకొల్లలుగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో వ్యవసాయం ఎలా ఉంటుందోనని ఊహించుకుంటేనే భయంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే రోడెక్కి ఆందోళనలు చేయనున్నట్లు రైతులు హెచ్చరిస్తున్నారు.

# క్యాన్సర్ చికిత్సతో సైడ్ ఎఫెక్ట్స్.. ఆసుపత్రిలో చేరిన కింగ్ చార్లెస్

బ్రిటన్ రాజు చార్లెస్-3 మరోసారి ఆసుపత్రిలో చేరారు. ఇటీవలే ఆయన క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం కోలుకున్నారు. అయితే, ఆ చికిత్స కారణంగా సైడ్ ఎఫెక్ట్స్ రావడంతో మళ్లీ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన లండన్‌లోని ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు బకింగ్ హామ్ ప్యాలెస్ వెల్లడించింది. మరోవైపు కింగ్ చార్లెస్ ఆసుపత్రిలో చేరడంతో అధికారిక కార్యక్రమాలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొంది. కాగా, 76 ఏండ్ల చార్లెస్ -3 క్యాన్సర్ బారిన పడినట్లు గతేడాది ఫిబ్రవరిలో నిర్ధరణ అయ్యింది. ప్రొస్టేట్‌కు చికిత్స సందర్భంగా వైద్య పరీక్షల్లో వ్యాధి బయటపడింది. అప్పటి నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నారు. అయితే అది ఏ రకమైన క్యాన్సరనేది అధికారికంగా వెల్లడించలేదు. ఇటీవలే బెంగళూరుకు వచ్చి కూడా వైద్యం చేయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు క్యాన్సర్ చికిత్స కారణంగా సైడ్ ఎఫెక్ట్స్ రావడంతో మళ్లీ ఆసుపత్రిలో చేరారు. 76 ఏండ్ల చార్లెస్-3 తన తల్లి క్వీన్ ఎలిజబెత్ మరణంతో 2022, సెప్టెంబర్ 8న రాజుగా బాధ్యతలు చేపట్టారు. 2023, మే 6న పట్టాభిషేకం చేశారు.

# ప్రభుత్వ పుస్తకాల్లో గ్యారెంటీ అప్పులు కనిపించట్లే




**హైదరాబాద్ అక్షరం న్యూస్:**
కార్పొరేషన్ల పేరిట సేకరించిన రుణాలకు ప్రభుత్వ ఖాతాల నుంచి అసలు, వడ్డీలు చెల్లించడాన్ని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' తప్పు పట్టింది. ఇలా చెల్లించడం వల్ల ప్రభుత్వ ఖాతాలో సరైన నిల్వలు ఉండడం లేదని ఆక్షేపించింది. కార్పొరేషన్ల పేర తీసుకుంటున్న గ్యారెంటీ రుణాలు ప్రభుత్వ ఖాతాల్లో ఎక్కడా కనిపించడం లేదు కానీ, అసలు, వడ్డీ చెల్లింపులు మాత్రం దర్శనమిస్తున్నాయని తెలిపింది. ఇది ప్రభుత్వ ఖాతాలోని నిల్వపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ప్రభుత్వ అప్పులను తక్కువ చేసి చూపుతున్నట్లు అర్థమవుతుందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థిక ఖాతాలపై కాగ్ రూపొందించిన నివేదికను ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది. రాష్ట్ర అప్పులు, గ్యారెంటీ అప్పులు, రాబడులు, వ్యయాలు, మూలధన వ్యయం తదితర అంశాలను కాగ్ వివరించింది. తీసుకున్న అప్పులకు సంబంధించి ప్రభుత్వ ఖాతాలో చాలా తక్కువ నిల్వ కనిపిస్తోందని తెలిపింది. 2024 మార్చి 31 నాటికి అప్పుల సొమ్ము నిల్వ రూ.969 కోట్లు మాత్రమే కనిపించాయని.. ఇందులో తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ రుణానికి సంబంధించి రూ.422 కోట్లు, ట్రాన్స్‌కో బాండ్లకు సంబంధించి రూ.502 కోట్లు ఉన్నాయని వివరించింది. ప్రతికూల నిల్వ వంటి పరిస్థితులు ఎదురవకుండా ఉండడానికి బడ్జెట్‌లో సరైన నిబంధనలను రూపొందించుకోవాలని సూచించింది.ప్రభుత్వానికి గ్యారెంటీ ఫీజు/కమీషన్ ఏది?.. కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చినందుకు ప్రభుత్వానికి రావాల్సిన గ్యారెంటీ ఫీజు/కమీషన్ కూడా సరిగా రావడం లేదని కాగ్ పేర్కొంది. ఒక కార్పొరేషన్‌కు గ్యారెంటీ ఇచ్చిన అప్పు మొత్తం సొమ్ముపై 0.5 శాతం లేదా గ్యారెంటీ వ్యవధిపై 2 శాతం చొప్పున ఫీజు/కమీషన్‌ను ఆ కార్పొరేషన్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. 2023-24లో ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలకు గాను కార్పొరేషన్ల నుంచి రూ.2,960 కోట్ల కమీషన్ రావాల్సి ఉండగా.. వచ్చింది మాత్రం రూ.3 కోట్లేనని కాగ్ వెల్లడించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తూ రావడం వల్ల 2023-24 నాటికి రాష్ట్ర అప్పు రూ.6,24,271 కోట్లకు చేరినట్లు తెలిపింది. ఇందులో ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పుతోపాటు కార్పొరేషన్లు తీసుకున్నవి కూడా ఉన్నాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో 2023 మార్చి నాటికే రూ.3,50,520కోట్ల అప్పు ఉంది. కానీ, 2023-24లో మరో రూ.53,144కోట్ల తీసుకోవడంతో అది రూ.4,03,664కోట్లకు చేరింది. కార్పొరేషన్లు రూ.2,20,607 కోట్ల అప్పులు తీసుకున్నాయి.7.32-7.75 శాతం వడ్డీతో రుణాలు.. 2023-24లో ప్రభుత్వం 7.32 నుంచి 7.75 శాతం వరకు వార్షిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకుందని కాగ్ వెల్లడించింది. 50 సార్లు రుణాలను సేకరించిందని, మొత్తం రూ.49,618 కోట్ల అప్పు తీసుకుందని వివరించింది. ఈ అప్పును 2030-2051 సంవత్సరాల మధ్య తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇవి కాకుండా ఎల్ఐసీ, జీఐసీ, నాబార్డు వంటి సంస్థల నుంచి మరో రూ.910 కోట్ల రుణం తీసుకుందని వెల్లడించింది. పాత అప్పులు, వడ్డీల కింద రూ.12,194 కోట్లను తిరిగి చెల్లించిందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు, అడ్వాన్సుల కింద మరో రూ.1,948 కోట్లు రాష్ట్రానికి అందాయని పేర్కొంది. మరోవైపు స్వల్పకాలిక రుణాలైన వేస్ అండ్ మీన్స్‌ను కూడా ప్రభుత్వం సేకరించిందని తెలిపింది. వీటి కింద 2023-24లో రూ.98,097కోట్ల అప్పు తీసుకుందని వివరించింది. అందులో రూ.97,098 కోట్లను చెల్లించిందని, వెయ్యి కోట్లు చెల్లించలేదని పేర్కొంది.కేంద్ర ప్రభుత్వ కట్టడి.. రాష్ట్ర ప్రభుత్వ అప్పులను కేంద్ర ప్రభుత్వం కట్టడి చేస్తూ వస్తోంది. 2023-24కుముందు మూడేళ్లు రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అప్పులు తీసుకోకుండా నియంత్రించినట్లు కాగ్ నివేదిక ద్వారా తెలుస్తోంది. 2020-21లో రూ.43,464 కోట్లను అప్పుగా తీసుకున్న ప్రభుత్వం.. 2021-22లో రూ.44,122 కోట్లను మాత్రమే తీసుకోగలిగింది. 2022-23లో కూడా మరో రూ.2,801 కోట్లను పెంచి రూ.46,923కోట్లను తీసుకోగలిగింది. 2023-24లో మరో రూ.6,221 కోట్లను పెంచి, రూ.53,144 కోట్లను తీసుకుంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్..

## డీఏ 2 శాతం పెంపుకు కేబినెట్ ఆమోదం



కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు.ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

# అప్పుల వినియోగమెంత?

## తెచ్చిన అప్పులను పూర్తిగా ఖర్చు పెట్టని సర్కారు.. మూలధన అంచనా వ్యయంలో తగ్గదల పరిమితికి మించి అప్పు తెచ్చిన రాష్ట్రం: కాగ్

**హైదరాబాద్ అక్షరం న్యూస్:**
తెచ్చిన అప్పులను ఆస్తుల సృష్టికి వినియోగించకపోవడం ఏటా చర్చనీయంగా మారుతోంది. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా అప్పు తెచ్చిన మొత్తంతో మూలధన వ్యయం కింద ఆస్తులను సృష్టిస్తుంది. కానీ.. రాష్ట్రంలో 2019 నుంచి ఏనాడూ అప్పుల సొమ్మును ఆస్తుల సృష్టికి పూర్తిస్థాయిలో వినియోగించలేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గుర్తించింది. రాబడులు, వ్యయాల మధ్య అంతరం ఏర్పడినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల బాట పట్టడం సాధారణమే..! ఈ అప్పులను ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, భవనాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలి. వీటి వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వానికి కూడా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా కొంత మేర రాబడి సమకూరే అవకాశాలుంటాయి. అందుకే.. అప్పులను తప్పకుండా మౌలిక సదుపాయాల కల్పనకే వినియోగించాలంటూ కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆయా రాష్ట్రాలను ఆదేశిస్తుంటాయి. తెలంగాణలో మాత్రం అప్పులను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడాన్ని కాగ్ తప్పుబట్టింది. ఇదివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం తాము అప్పులు చేసినా.. పెద్ద మొత్తంలో ఆస్తులను సృష్టించామని చెప్పేది. సాగునీటి ప్రాజెక్టులు, సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ వంటి భవనాలను నిర్మించామని ఆ పార్టీ నేతలు చెప్పేవారు. వాస్తవ వ్యయాలను చూస్తే మాత్రం.. తెచ్చిన అప్పులను పూర్తిస్థాయిలో మూలధన వ్యయం కింద ఖర్చు పెట్టినట్లు కనిపించడం లేదని కాగ్ ఆక్షేపించింది.

ఆశించిన మేర రాని రాబడులురాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిన మేర రాబడులు సమకూరడం లేదని కాగ్ వెల్లడించింది. భారీ మొత్తంలో అంచనాలను రూపొందిస్తున్నప్పటికీ.. సంవత్సరాంతానికి ఆదాయాలు లక్ష్యం మేర రావడం లేదని తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడులు 78% మేర సమకూరాయని వివరించింది. రెవెన్యూ రాబడుల అంచనా రూ.2,16,567 కోట్లుగా ఉంటే.. రూ.1,69,293 కోట్లు(78%) సమకూరాయి. రెవెన్యూ వ్యయం కింద రూ.2,11,685 కోట్లను ఖర్చు చేస్తామని ప్రభుత్వం అంచనా వేయగా.. ఆ సంవత్సరం రూ.1,68,514 కోట్ల(90%)ను మాత్రమే వ్యయం చేయగలిగింది. ఇది కేవలం ఆ ఒక్క సంవత్సరంలోనే కాదు.. అంతకుముందు కూడా అంచనాల కంటే తక్కువగా ప్రభుత్వం వ్యయం చేసిందని కాగ్ వెల్లడించింది. అప్పుల కిస్తీలు, వడ్డీ చెల్లింపులకే ప్రభుత్వం 15.90% మేర నిధులను వెచ్చించిందని కాగ్ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.49,977 కోట్ల ఆర్థిక లోటు ఏర్పడడం వల్ల.. దాన్ని పూడ్చుకోవడానికి రూ.40,957 కోట్ల అప్పు తీసుకున్నట్లు గుర్తుచేసింది. ఆగంతుక నిధి నుంచి రూ.కోటి, ప్రభుత్వ ఖాతా నుంచి రూ.8,984 కోట్లను సేకరించిందని వివరించింది. మొత్తం రెవెన్యూ రాబడులు రూ.1,69,293 కోట్లలో 41% నిధులను వేతనాలు, భత్యాలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లకే ఖర్చుచేయాల్సి వచ్చిందని తెలిపింది. జీతభత్యాలకు రూ.27,981 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.24,347 కోట్లు, పెన్షన్లకు రూ.16,835 కోట్లు చెల్లించిందని వివరించింది. వడ్డీ చెల్లింపులు(రూ.24,347 కోట్లు-10.5%), అప్పుల కిస్తీల చెల్లింపులు(రూ.12,519 కోట్లు- 5.4%) మేర.. మొత్తం 15.9% ఉన్నాయని ఆక్షేపించింది.జీఎస్‌డీపీలో పరిమితికి మించి అప్పులు..2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) పరిమితికి మించి అప్పు చేసిందని కాగ్ ఆరోపించింది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిబంధనల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీలో రాష్ట్ర అప్పుల మొత్తం 33.10 శాతానికి మించకూడదు. కానీ.. ఆ సంవత్సరం అప్పుల మొత్తం జీఎస్‌డీపీలో 34.47శాతాని(రూ.5,17,659 కోట్ల అప్పు)కి చేరాయని కాగ్ తప్పుబట్టింది. జీఎస్‌డీపీలో ఆర్థిక లోటు(ఫిస్కల్ డెఫిసిట్) కూడా 3 శాతానికి మించకూడదు. కానీ.. రూ.49,977 కోట్ల లోటుతో 3.33 శాతానికి చేరడాన్ని కాగ్ ఆక్షేపించింది.స్థానిక సంస్థలకు రూ.13,690 కోట్ల గ్రాంట్లు:.. రాష్ట్రంలోని పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.13,690 కోట్ల గ్రాంట్లను మంజూరు చేసిందని కాగ్ వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలు, ఎన్‌జీవోలు, ఇతర సంస్థలన్నింటికీ చెల్లించిన మొత్తం గ్రాంట్ల(రూ.76,773 కోట్లు)లో పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థలకు చెల్లించిందే 18 శాతమని వివరించింది.



# రెడ్‌మీ కొత్త వైఫై ట్యాబ్.. రూ.20 వేలకే రోబో వాక్యూమ్ క్లీనర్



'స్మార్టర్ లివింగ్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో షావోమి పలు కొత్త ప్రొడక్ట్‌లను విడుదల చేసింది. వీటిలో రెడ్‌మీ ప్యాడ్ ఎస్‌ఈ, బడ్స్ 5ఏ, రోబో వాక్యూమ్ క్లీనర్ ఎస్10, గార్మెంట్ స్టీమర్ ఉన్నాయి.ప్యాడ్ ప్రారంభ ధర రూ.12,999 కాగా.. స్టీమర్ రూ.2,299 నుంచి లభిస్తోంది. ఆయా డివైజ్‌ల ఫీచర్లు, ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం..!ఈ ప్యాడ్‌ను 11 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. 6ఎన్‌ఎం ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 680 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 13 ఆధారిత ఎంఐయూఐ ప్యాడ్ 14 సిస్టమ్‌తో పని చేస్తుంది. వెనక 8ఎంపీ, ముందు 5ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై, బ్లూటూత్ 5.2 కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి. 10వాట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో 8,000 ఎంఏహెచ్ బ్యాటరీని పొందుపర్చారు. దీంట్లో మూడు వేరియంట్లు ఉన్నాయి. 4జీబీం128జీబీ ధర రూ.12,999, 6జీబీం128జీబీ ధర రూ.13,999, 8జీబీం128జీబీ ధర రూ.14,999. లాంచింగ్ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులతో కొనుగోలు చేసేవారికి రూ.1,000 తక్షణ రాయితీ ఇస్తున్నారు. గ్రాఫైట్ గ్రే, లావెండర్ పర్పుల్, మింట్ గ్రీన్ రంగుల్లో ఇది అందుబాటులో ఉంది. ఏప్రిల్ 24 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ షావోమి రిటైల్ స్టోర్లలో లభిస్తాయి.రోబో వాక్యూమ్ క్లీనర్ ఎస్10..శుభ్రం చేయాలనుకున్న ఏరియాను అత్యంత కచ్చితత్వంతో మ్యాప్ చేసేలా రోబో వాక్యూమ్ క్లీనర్ ఎస్10లో అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థను పొందుపర్చారు. జిగ్‌జాగ్, వై ఆకారపు రూట్లలోనూ క్లీన్ చేసేలా దీన్ని రూపొందించారు. మొండి మరకలు, చెత్తను సైతం శుభ్రం చేసేలా 4000%ఖ% టర్బో సక్షన్ పవర్‌తో ఇది పని చేస్తుంది. లాంచ్ సందర్భంగా రూ.1,000 రాయితీతో కలిపి దీన్ని రూ.19,999 ప్రత్యేక ధర వద్ద కొనుగోలు చేయొచ్చు. మే 6 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయి.రెడ్‌మీ బడ్స్ 5ఏ ధర, ఫీచర్లు..రెడ్‌మీ బడ్స్ 5ఏ 25 డెసిబుల్స్ వరకు యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్‌తో వస్తోంది. 12 ఎంఎం డ్రైవర్స్‌తో వస్తోన్న ఈ బడ్స్ బ్లూటూత్ 5.4 కనెక్టివిటీతో పనిచేస్తుంది. గూగుల్ ఫాస్ట్ పెయిర్ ఫీచర్ ఉంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే కేస్‌తో కలిపి 30 గంటల వరకు పని చేస్తుంది. 10 నిమిషాలు ఛార్జ్ చేస్తే 90 నిమిషాల ప్లేటైమ్ ఉంటుందని కంపెనీ తెలిపింది. వీటి ధర రూ.1,499. ఏప్రిల్ 29 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ షావోమి రిటైల్ స్టోర్లలో లభిస్తాయి.గార్మెంట్ స్టీమర్.. 1,300 వాట్ పవర్‌తో షావోమి కొత్త గార్మెంట్ స్టీమర్‌ను తీసుకొచ్చింది. నిమిషానికి 24 గ్రాముల స్టీమ్‌ను స్థిరంగా విడుదల చేస్తుందని కంపెనీ తెలిపింది. అన్ని రకాల దుస్తుల ముడతలను తొలగించగలదని పేర్కొంది. 26 సెకన్లలోనే వేడెక్కుతుందని తెలిపింది. రూ.2,299 ధర వద్ద ఇది లభిస్తోంది. మే 6 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, షావోమి రిటైల్ స్టోర్లలో దొరుకుతాయి.

# వాట్సప్‌లో కొత్త ఫీచర్.. ఇంటర్నెట్ లేకున్నా ఫొటోలు పంపించొచ్చు!



ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తన ప్లాట్‌ఫామ్‌ను ఆల్-ఇన్-వన్‌గా రూపుదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. ఆ దిశగా కొత్త కొత్త ఫీచర్లు జోడిస్తోంది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదుపాయాన్ని తీసుకొచ్చిన ఈ యాప్.. మరో కొత్త ఫీచర్‌కు సిద్ధమవుతోంది. ఇంటర్నెట్ లేకున్నా ఫొటోలు, వీడియోలు, ఫైల్స్‌ను షేర్ చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. అంటే ఇకపై నెట్‌వర్క్‌తో సంబంధం లేకున్నా మీ డాక్యుమెంట్లను పంపించొచ్చన్నమాట.సాధారణంగా నెట్‌వర్క్ సదుపాయం లేకున్నా బ్లూటూత్ సాయంతో షేర్ఇట్, నియర్ బై షేర్ వంటి అప్లికేషన్ల ద్వారా ఫొటోలు, సినిమాలు పంపిస్తుంటారు. అచ్చం ఆ తరహా సేవల్నే వాట్సప్ అందుబాటులోకి తేనుంది. దీనివల్ల ఎటువంటి ప్రత్యేక యాప్ వినియోగించాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్లను మరింత వేగంగా సురక్షితంగా పంపేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడనుంది. ఈ ఫీచర్ ఎనేబల్ చేసుకోవాలంటే వాట్సప్ సిస్టమ్ ఫైల్, ఫొటోల గ్యాలరీ యాక్సెస్ లాంటి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.మీరు పంపించాలనుకుంటున్న వ్యక్తి మొబైల్ బ్లూటూత్ కనెక్ట్ అయ్యేంత దగ్గర్లో ఉంటేనే ఆఫ్‌లైన్ షేరింగ్‌కు వీలవుతుంది. బ్లూటూత్ ఆన్ చేసి దగ్గర్లోని వాట్సప్ యూజర్ పరికరాన్ని గుర్తించి ఫైల్ సెండ్ చేయాలి. అవతలి వ్యక్తి అనుమతి ఇస్తేనే ఈతరహా షేరింగ్ సాధ్యమవుతుంది. వద్దనుకుంటే ఆఫ్ చేసే సదుపాయం కూడా ఉంది. వాట్సప్ ద్వారా వివిధ రకాల ఫైల్స్‌ను పంపడాన్ని సులభతరం చేయడం కోసం ఈ ఫీచర్‌ని తీసుకొచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు వాట్సప్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందించే 'వాబీటా ఇన్ఫో' తన బ్లాగ్‌లో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ బీటా యూజర్లకు టెస్టింగ్ దశలోనే ఉంది. రానున్న రోజుల్లో అందరికీ అందుబాటులోకి రానుంది.మరో కొత్త ఆప్షన్..వాట్సప్ మరో కొత్త ఫీచర్‌పై పని చేస్తోంది. చాట్ లిస్ట్‌లో ఫేవరెట్స్ అనే ఆప్షన్‌ను జోడించనుంది. మీకు ఇష్టమైన వ్యక్తుల్ని ఇందులో యాడ్ చేసుకోవచ్చు. ఇకపై మీరు తరచూ చాట్ చేసేవారు, నచ్చిన వాళ్ల కోసం కాంటాక్ట్స్ మొత్తం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం ఈ ఫీచర్ కూడా టెస్టింగ్ దశలోనే ఉందని, త్వరలోనే బీటా యూజర్లకు అందుబాటులోకి రానుందని వాబీటా పేర్కొంది.

# బిజినెస్



## వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్లూ రాణించాయి.ఉదయం ఓ మోస్తరు లాభాలు నమోదు చేసిన సూచీలు.. అమ్మకాల ఒత్తిడితో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఉదయం 74,048 పాయింట్ల వద్ద లాభాలలో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 73,688.31 – 74,059.89 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 89.83 పాయింట్ల లాభంతో 73,738.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 31.60 పాయింట్ల లాభంతో 22,368 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.33గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, నెస్లే ఇండియా, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటార్స్ షేర్లు ప్రధానంగా రాణించాయి. సన్‌ఫార్మా, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లలో చాలావరకు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ 87.05 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బజాజ్ ఆటో లిమిటెడ్ తన ఎలక్ట్రిక్ వాహన విభాగమైన చేతక్ టెక్నాలజీ లిమిటెడ్‌కు అబ్రహం జోసెఫ్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న జోసెఫ్ ప్రస్తుతం చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఉన్నారు. పల్సర్, ప్లాటినా, సీటీ, బాక్సర్, డిస్కవర్, వి.అవెంజర్, డామినర్ వంటి పాపులర్ బ్రాండ్లు ఆయన నేతృత్వంలోనే రూపుదిద్దుకున్నాయి. ఇకపై చేతక్ ఈవీ బాధ్యతలను చూడనున్నారు. రామ్‌తిలక్ అనంతన్ బజాజ్ ఆటో లిమిటెడ్ సీటీఓగా వ్యవహరిస్తారు.

# బాబోయ్... ఏమిటీ మోత..!

కాలుష్యం అన్నమాట వినగానే దట్టంగా కమ్ముకున్న నల్లని పొగా, రసాయనాల వాసనలూ గుర్తొస్తాయి. కానీ చాపకింద నీరులా మరో కాలుష్యమూ వ్యాపిస్తోంది. మనకు తెలియకుండానే మన ఆరోగ్యాలను కబళిస్తోంది.అవును... వాయుకాలుష్యం లాగే శబ్దకాలుష్యమూ ప్రాణాంతకమే! ఇది ఏకంగా గుండెకే గురిపెడుతుంది మరి!శబ్దం లేనిదే మనిషి లేడు.అమ్మ కడుపులో పడింది మొదలు ఆఖరిశ్వాస వరకూ గుండె లబ్‌డబ్‌లు మనిషిని అంటిపెట్టుకుని ఉండే చప్పుడు.మాట్లాడితే... అది ఏ భాష అయినా, అర్థం కావాలంటే ఉచ్చారణ బాగుండాలి.ఏ పదాన్ని ఎక్కడ ఒత్తి పలకాలో, ఎక్కడ తేల్చాలో తెలియాలి.పాట పాడితే శ్రుతీ లయా ఉండాలి. సహవాయిద్యాల తోడుండాలి.శుభకార్యానికి బాజా భజంత్రీలు కావాలి. పండుగలూ వేడుకలూ వస్తే బాణసంచా కాల్చాలి. డప్పు మోగించాలి.అసలు శబ్దం లేనిదెక్కడ..! మనిషి ఎక్కడ ఉంటే అక్కడ ఏదో ఒక శబ్దం ఉంటుంది.కానీ... అన్ని శబ్దాలూ మనకు నచ్చుతాయా?నచ్చకపోవడమే కాదు, ప్రాణాంతకంగా మారుతున్న శబ్దాలూ ఎన్నో ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం అమెరికాలో ఒక సర్వే చేశారు. మీ చుట్టుపక్కల మీకు నచ్చని విషయం ఏమిటీ అని అడిగితే 'ఇరుగూపొరుగూ కుటుంబాలు చేసే శబ్దం' అని చెప్పారట ఎక్కువమంది. సామాజికంగా అక్కడ ఎన్నో నియమాలుంటాయి. క్రమశిక్షణను అతిక్రమిస్తే జరిమానాలూ ఉంటాయి. అయినా అలా చెప్పారంటే- శబ్దం అంత ఇబ్బంది కలిగిస్తుంది మరి.చీటికీ మాటికీ తలనొప్పి వస్తోంటే కారణమేంటో అని పరీక్షలన్నీ చేయించుకుంటాం కానీ ఇంటెదురుగా ఆర్నెల్లుగా సాగుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణం తాలూకు చప్పుళ్లే దానికి కారణమని ఊహించం.కడుపులో గడబిడగా ఉంటే- పడనివి ఏమీ తినలేదే అని జుట్టు పీక్కుంటాం కానీ టపాకాయల మోత కడుపులో సృష్టిస్తున్న అలజడి అదని గుర్తించలేం.పాతికేళ్ల కుర్రాడి గుండె హఠాత్తుగా ఆగిపోతే- మాయదారి రోగాలని నిట్టూరుస్తాం కానీ పెళ్లి వేడుకకని పెట్టిన డీజే మోత ఆ గుండెని గట్టిగా తాకిందని అస్సలు అనుకోం.వాయుకాలుష్యమైతే శ్వాస సమస్యలు వస్తాయి కాబట్టి వెంటనే తెలుస్తుంది. నీటి కాలుష్యమైతే అప్పటికప్పుడు జీర్ణవ్యవస్థమీద ప్రభావం పడుతుంది కాబట్టి గబుక్కున ఆస్పత్రికి వెళ్తాం. కానీ శబ్దకాలుష్యం అలా కాదు. దాని ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూపలేం కాబట్టి అది నిర్లక్ష్యానికి గురవుతోంది. సైలెంట్ కిల్లర్‌లా వ్యాపిస్తోంది.శబ్దాన్ని డెసిబెల్స్‌లో కొలుస్తారు. మన చుట్టూ ఉండే వాతావరణంలో రకరకాల శబ్దాలుంటాయి. అవి 20 డెసిబెల్స్ దాటనంతవరకూ మనిషి చెవికి ఆహ్లాదం కలిగిస్తాయి. పక్షుల కిలకిలారావాలూ వానజల్లులూ ఆకుల గలగలల్లాంటివి ఆ కోవలోకి వస్తాయి. మామూలు సంభాషణ 30- 50 మధ్య ఉండవచ్చు. అదే గట్టిగా ఓ ఉరుము ఉరిమితే 120 డెసిబెల్స్‌లో విన్పిస్తుంది. ఇవి ప్రకృతిసిద్ధమైన శబ్దాలు.



# మజ్జిగ అన్నం తింటే ఇన్ని సమస్యలు దూరమవుతాయా..



పెరుగు అన్నం అంటే చాలా మందికి ఇష్టం. ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. చిన్న పిల్లలే కాదు.. పెద్ద వాళ్లు కూడా చాలా ఇష్టంగా పెరుగు అన్నం తింటూ ఉంటారు.పెరుగు అన్నం తినడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయి. అయితే పెరుగు అన్నం కంటే మజ్జిగ అన్నం తినడమే ఆరోగ్యానికి మరింత మంచిదట. మజ్జిగ శరీరాన్ని చల్లబరుస్తుంది. డీహైడ్రేట్ కాకుండా చేస్తుంది. కండరాలు ఆరోగ్యంగా, బలంగా, దృఢంగా ఉండేందుకు మజ్జిగ చాలా మంచిది. ఇందులో క్యాల్షియం కూడా మెండుగా లభిస్తుంది. దీని వలన దంతాలు, ఎముకలు బలంగా ఉంటాయి. మజ్జిగ అన్నంలో విటమిన్ బి12, ల్యాక్టిక్ యాసిడ్ లభిస్తాయి. ఇవి పొట్ట సమస్యలు రాకుండా చేస్తాయి. ఇతర లాభాలు కూడా చాలా ఉన్నాయి. మరి పెరుగు అన్నం తినడం వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.చర్మ ఆరోగ్యానికి మంచిది:మజ్జిగ అన్నం తినడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మ కణాలను పునరుత్పత్తి చేసేందుకు సహాయ పడుతుంది. దీని కారణంగా చర్మం కాంతివంతంగా ఉంటుంది. ముడతలు తగ్గి.. యవ్వనంగా ఉంటారు. మజ్జిగ తాగితే చర్మం మృదువుగా మారుతుంది. మజ్జిగ అన్నంత తింటే ముఖం మెరుస్తూ ఉంటుంది.ఎముకలు బలంగా:మజ్జిగ అన్నం తినడం వల్ల ఎముకలు గట్టి పడతాయి. ఎముకలు బలహీనంగా ఉండి బాధ పడుతున్నవారు మజ్జిగ అన్నం తింటే చాలా మంచిది. ముఖ్యంగా చిన్న పిల్లలకు ప్రతి రోజూ మజ్జిగ అన్నం పెట్టడం వల్ల వారు ఎదుగుదల సవ్యంగా ఉంటుంది. ఎముకలు బలంగా మారతాయి. దంతాలు కూడా దృఢంగా ఉంటాయి.కండరాలు ఆరోగ్యం:పిల్లలు, పెద్దలు ప్రతి రోజూ మజ్జిగ అన్నం తింటే కండరాలు కూడా బలంగా మారతాయి. కండరాలు బలంగా ఉంటే.. ఎలాంటి నొప్పులు రాకుండా ఉంటాయి.గుండె ఆరోగ్యం:మజ్జిగ అన్నం తినడం వల్ల గుండె కూడా ఆరోగ్యంగా పని చేస్తుంది. మజ్జిగలో ఉండే పొటాషియం.. రక్త పోటును నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. తల నొప్పి కూడా తగ్గుతుంది.శరీరానికి చల్లదనం ఇస్తుంది:మజ్జిగ అన్నం తినడం వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది. ముఖ్యంగా ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు మజ్జిగ అన్నం తినడం చాలా మంచిది. ఇది బాడీ కూల్ చేయడంతో పాటు బాడీ డీహైడ్రేషన్‌కి గురి కాకుండా చేస్తుంది. పొట్ట ఆరోగ్యం:మజ్జిగ అన్నం తినడం వల్ల జీర్ణ క్రియ అనేది బాగా మెరుగు పడుతుంది. ఇందులో లాక్టిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ క్రియను మెరుగు పరిచేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే పేగుల ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేసి.. మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది.

# ఆపేసిన ఆరేడు నెలల్లో సర్దుకుంటుంది

శాస్త్రవేత్తలకి ఇప్పటిదాకా ఇదో మిస్టరీ. కాన్పయ్యాక స్త్రీల ఎముకల్లోని క్యాల్షియమే పోషకాలు నిండిన తల్లిపాలగా మారుతుంది. మరి క్యాల్షియం అంతగా వినియోగమవుతున్నప్పుడు ఎముకలు గుల్ల బారాలి కదా...అలా జరగదు. అంతేకాదు, పాలిచ్చే తల్లుల్లో- మనుషుల్లో ఎముకల గట్టిదనానికి తోడ్పడే ఈస్ట్రోజన్ హార్మోన్ స్రావం కూడా తగ్గుతుంది. ఈ రెండు కారణాలవల్ల ఎముకలు బలహీనం కావాలి... కానీ వాటి సాంద్రత ఏదో కొంత తగ్గడం తప్ప తల్లులకి మరే సమస్యా ఉండదు.తగ్గిన సాంద్రత కూడా పాలివ్వడం ఆపేసిన ఆరేడు నెలల్లో సర్దుకుంటుంది. ఇదెలా సాధ్యమవుతోందన్న దానిపైన శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తూ వస్తున్నారు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియాకి చెందిన పరిశోధకులు ఛేదించారు. బాలింతల్లో 'ఈస్ట్రోజన్ హార్మోను ఇక విడుదలకాదు!' అన్న విషయం మెదడుకి చేరగానే అది మరో ప్రత్యేక హార్మోన్‌ని విడుదల చేస్తోందట.దానికి 'సీసీఎన్3' అని పేరుపెట్టారు శాస్త్రవేత్తలు. దాంతో ఇప్పుడు- ఎముకల్ని గుల్లబార్చే ఆస్టియోపొరోసిస్ వంటి తీవ్ర వ్యాధులకి దీన్ని చికిత్సగా ఉపయోగించబోతున్నారట. ఈ హార్మోన్‌ను వేరుచేసి ఎముకలు విరిగిన ఎలుకలపైన ప్రయోగిస్తే... 240 శాతం సత్ఫలితాల నిచ్చిందట.



# జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ క్రీడాకారుల ఘన విజయం కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్ ఆగస్టు 10 : అక్షరం న్యూస్)
ఈ నెల 4న బెంగళూరులో జరిగిన 13వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ రాష్ట్రం జివిఆర్ కరాటే అకాడమీ నుండి 18 ంది విద్యార్థులు కటా, కుమితి విభాగాల్లో ప్రతిభ కనబరిచి హౌరా అనిపించారు.కటా విభాగంలో 14 బంగారు పతకాలు, 3 రజత పతకాలు, కుమితి విభాగంలో 15 బంగారు పతకాలు, 3 రజత పతకాలు సాధించి మొత్తం 29 బంగారు పతకాలు,6 రజత పతకాలతో చాంపియన్షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం విజేతలకు పతకాలు,ప్రశంస పత్రాలను అందజేస్తూ, “తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు క్రీడలలో చురుకుగా పాల్గొనాలని పేర్కొన్నారు.ఆత్మరక్షణ విద్య బాలికలకు భద్రత మాత్రమే కాదు, ధైర్యం ఆత్మవిశ్వాసానికి కూడా పునాది.క్రీడలు క్రమశిక్షణ,శారీరక దృఢత్వం, మానసిక ధైర్యాన్ని పెంపొందిస్తాయి అన్నారు.ఈ విజయాలు రాష్ట్రానికి గర్వకారణం అని అన్నారు.జివిఆర్ కరాటే అకాడమీ ద్వారా ఎందరో ప్రతిభావంతులైన క్రీడాకారులు దేశానికే గర్వకారణంఅవుతున్నారని, ఈ అవకాశాన్ని అందిస్తున్న అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్. గోపాల్ రెడ్డి సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, అకాడమీ బ్లాక్ బెల్ట్స్ అమృతరెడ్డి, గణ సంతోషిని రెడ్డి,సుధాకర్,అనఘ,వెంకట్ రెడ్డి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ కమర్షియల్ షాప్స్ రిటెండర్స్ వేయాలి




హైదరాబాద్ ఆగస్టు 10 : అక్షరం న్యూస్)
వ్యవసాయ మార్కెట్ కమిటీ చౌటుప్పల్ కార్యాలయం లో మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉబ్బు వెంకటయ్య అద్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశము ఏర్పాటు చేయనైనది. మార్కెట్ యార్డ్ చౌటుప్పల్ అబివృద్ధి లో బాగంగా మార్కెట్ యార్డ్ బయటి భాగం లో గల కమర్షియల్ షాప్స్ మరల రీటెండర్ వేసి మార్కెట్ ఆదాయం ను పెంచాలని, చౌటుప్పల్ మార్కెట్ యార్డ్ లో మార్కెట్ కమిటీ వారి అద్వర్యం లో ధాన్యపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చెయ్యాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించడం జరిగింది. రైతులకు ఉపయోగార్ధం చౌటుప్పల్ మార్కెట్ వచ్చినటువంటి తార్పాలిన్లు, ధాన్యమును ఆరపెట్టు యంత్రమును పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ రఘుమారెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు బోయ వెంకటేష్, కరంటోతు శంకర్ నాయక్, డిల్లి చంద్రకళ, మహమ్మద్ గౌస్ ఖాన్, చిమ్మల వెంకట్ రెడ్డి, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మర్రి రాజి రెడ్డి, సూర్వి వెంకటేష్ గౌడ్, దాచేపల్లి విజయ్ కుమార్, గజ్జెల కృష్ణ మూర్తి, మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలి

## గతంలో రైతు బీమా ఉన్నవారికి అవసరం లేదు

హైదరాబాద్ ఆగస్టు 10 : అక్షరం న్యూస్)
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రైతులు రైతు బీమా కి దరఖాస్తు చేసుకోగలరని,5/6/2025 వరకు పట్టాదారు పాస్ బుక్ వచ్చిన రైతులు18 నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న రైతులు అర్హులని, గతంలో రైతు బీమా చేసుకున్న వాళ్ళు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదు.కావున రైతులు ఈ నెల 13 తారీకు లోపు సంబంధిత ఏఈఓ వద్ద దరఖాస్తు చేసుకోగలరని కొడిమ్యాల మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి తెలిపారు.

# గోరు వెచ్చని నీరు..లాభాలు..



ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగుతున్నా కూడా మలబద్దకం తగ్గుతుంది. ఈ మిశ్రమం జీర్ణ వ్యవస్థను శుభ్రంగా మారుస్తుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలను బయటకు పంపుతుంది. దీంతో సమస్య తగ్గిపోతుంది. అలాగే రాత్రిపూట పాలలో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. రాత్రి పూట భోజనం చేసిన అనంతరం లేదా నిద్రకు ముందు ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలను తినాలి. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి జీర్ణ సమస్యలకు బొప్పాయి పండు ఔషధంగా పనిచేస్తుంది. మునగాకులను రోజువారి ఆహారంలో భాగం చేసుకున్నా ఉపయోగం ఉంటుంది. మునగాకులను కూరగా, పప్పుగా చేసుకుని తినవచ్చు. లేదా ఈ ఆకులను ఎండబెట్టి పొడి చేసి దాన్ని రోజూ మీరు తినే ఆహారాల్లో కలిపి తీసుకోవచ్చు. దీంతోనూ జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

# వాల్ నట్స్‌తో కలిగే లాభాలు ఏమిటి..?



హైదరాబాద్ ఆగస్టు 10 : అక్షరం న్యూస్)
ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ నట్స్‌ను తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతుంటారు. అయితే చాలా మంది బాదం, జీడిపప్పు, పిస్తా వంటి నట్స్‌ను తింటుంటారు. కానీ వాల్ నట్స్ జోలికి వెళ్లరు. వాస్తవానికి మిగిలిన నట్స్ కన్నా ఇవి ఎంతో బలవర్ధకమైనవని చెప్పవచ్చు. ఇతర నట్స్‌లో కన్నా వాల్ నట్స్‌లోనే పోషకాలు అధికంగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే వాల్ నట్స్‌ను తినాలని చాలా మంది ఆసక్తి చూపిస్తుంటారు. కానీ రోజుకు అసలు ఎన్ని వాల్ నట్స్‌ను తినాలి, అసలు వీటిల్లో ఉండే పోషకాలు ఏమిటి, ఈ నట్స్‌ను తింటే ఏం జరుగుతుంది.. అని సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. వాల్ నట్స్‌ను రోజుకు 4 నుంచి 7 వరకు తినవచ్చు. వీటిని కనీసం 6 నుంచి 8 గంటల పాటు నీటిలో నానబెట్టి తినాల్సి ఉంటుంది.

### ఇలా తినాలి..

వాల్ నట్స్‌ను నేరుగా తినడం చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. అలా తింటే కొందరికి వాంతికి వచ్చినట్లు ఉండడం, వికారంగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కనుక ఈ నట్స్‌ను నీటిలో నానబెట్టి తినాల్సి ఉంటుంది. రాత్రి పూట నీటిలో నానబెట్టిన నట్స్‌ను ఉదయం తినాలి. లేదా ఉదయం నానబెడితే సాయంత్రం స్నాక్స్ రూపంలోనూ తినవచ్చు. ఇక వాల్ నట్స్‌ను తింటే మనకు అనేక అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. ఈ నట్స్‌లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. వాల్ నట్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఆల్ఫా లినోలీనిక్ యాసిడ్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవి శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. వాల్ నట్స్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె పోటు రాకుండా నివారించవచ్చు.

### మెదడు ఆరోగ్యానికి..

వాల్ నట్స్ చూసేందుకు అచ్చం మెదడు ఆకారంలోనే ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను బ్రెయిన్ ఫుడ్ అని కూడా పిలుస్తారు. ఈ నట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి ప్రభావం మెదడుపై పడకుండా చేస్తాయి. దీంతో మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. అలాగే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. పిల్లలకు ఈ నట్స్‌ను రోజూ తినిపిస్తే వారి మెదడు వికసిస్తుంది. చదువుల్లో రాణిస్తారు. తెలివి తేటలు పెరుగుతాయి. వాల్ నట్స్ ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. ఈ నట్స్‌ను తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

### క్యాన్సర్ రాకుండా..

వాల్ నట్స్‌లో చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. పాలిఫినాల్స్‌తోపాటు విటమిన్ ఇ, మెలటోనిన్ కూడా అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీర కణజాలానికి మరమ్మత్తులను నిర్వహిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. అధికంగా బరువు ఉన్నవారు వాల్ నట్స్‌ను తమ రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వాల్ నట్స్‌లో క్యాలరీలు అధికంగా ఉన్నప్పటికీ వీటిల్లో ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. కనుక ఇవి ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేస్తాయి. కడుపు నిండుగా ఉన్న భావనను కలిగిస్తాయి. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. కనుక బరువు తగ్గాలని చూస్తున్న వారు వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# మతిమరుపు సమస్య ఇబ్బందులకు గురి చేస్తుందా..?

### అయితే ఈ ఆహారాలను రోజూ తినండి..!



వయస్సు మీద పడుతున్న కొద్దీ సహజంగానే ఎవరికైనా సరే మెదడు పనితీరు మందగిస్తుంది. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోతాయి. ఏ విషయంపై కూడా దృష్టి సారించలేకపోతుంటారు. ముఖ్యంగా మతిమరుపు సమస్య వస్తుంది. ఇది తీవ్రతరం అయితే అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అయితే కొందరు యుక్త వయస్సులో ఉన్నప్పటికీ మతిమరుపు సమస్యతో బాధపడుతుంటారు. మెదడు పనితీరు మందగించినట్లు అనిపిస్తుంది. దేనిపై కూడా ధ్యాస పెట్టలేకపోతుంటారు. ఏకాగ్రత లోపిస్తుంది. అలాంటి వారు కొన్ని రకాల ఆహారాలను తీసుకుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. మతిమరుపు అనేది పలు రకాల కారణాల వల్ల వస్తుంది. విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్ల లోపం ఉంటే ఈ సమస్య ఎదురవుతుంది. అందుకు గాను కొన్ని ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### చేపలు..

చేపలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. అలాగే డోకోసాహెగ్జాఇనోయిక్ యాసిడ్ (డీహెచ్ఏ) కూడా ఉంటుంది. ఇవి మెదడు కణాలను నిర్మించేందుకు సహాయం చేస్తాయి. దీని వల్ల మెదడు, నాడీ మండల వ్యవస్థ కణాలు ఉత్తేజితం అవుతాయి. మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటుంటే మతిమరుపు సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే మనకు అనేక రకాల బెర్రీ పండ్లు సైతం అందుబాటులో ఉన్నాయి. బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, రాస్ప్‌బెర్రీలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఈ బెర్రీ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. ఇవి మెదడుపై పడే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో మెదడు కణాలు వాపులకు గురి కాకుండా ఉంటాయి. మెదడు కణాలు ఉత్తేజితం చెంది ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. మతిమరుపు తగ్గుతుంది.

### ఆకుకూరలు..

ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలను మెదడుకు అద్భుతమైన ఆహారంగా చెప్పవచ్చు. పాలకూర ఈ జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇందులో విటమిన్ కె, లుటీన్, ఫోలేట్, బీటా కెరోటిన్ అధికంగా ఉంటాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. మెదడు కణాలను నిర్మించేందుకు సహాయం చేస్తాయి. దీంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మతిమరుపు తగ్గిపోతుంది. అలాగే వాల్ నట్స్, బాదంపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది మెదడు కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, జింక్, మెగ్నిషియం, కాపర్, ఐరన్ వంటి పోషకాలు నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. మతిమరుపు సమస్య తగ్గేలా చేస్తాయి.

### కోడిగుడ్డు..

రోజూ ఒక కోడిగుడ్డును తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ఎలాంటి రోగాలు రావని వైద్యులు చెబుతుంటారు. అయితే రోజుకు ఒక గుడ్డును తింటే మెదడు సైతం ఆరోగ్యంగా ఉంటుంది. యాక్టివ్‌గా పనిచేస్తుంది. కోడిగుడ్లలో కోలిన్ ఉంటుంది. ఇది అసిటైల్ కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్‌ను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. గుడ్లలో ఉండే విటమిన్లు బి6, బి12, ఫోలేట్ వయస్సు మీద పడడం వల్ల మెదడు కణాలు క్షీణించే రేటును తగ్గిస్తాయి. దీంతో మెదడు ఎల్లప్పుడూ ఉత్తేజంగా ఉంటుంది. మతిమరుపు తగ్గిపోతుంది. అయితే కోడిగుడ్డులో ఉండే పచ్చని సొనను తింటేనే ఈ లాభాలు కలుగుతాయి. అలాగే పసుపు కూడా మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పసుపు కలిపిన పాలను తాగుతుంటే మెదడు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మెదడు కణాలు నిర్మాణమవుతాయి. దీంతో మతిమరుపు తగ్గుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఇలా పలు ఆహారాలను తరచూ తీసుకుంటుంటే మతిమరుపు సమస్యను తగ్గించుకోవచ్చు.

# అసలు మునగాకులను ఎలా తినాలి..?

## వీటిలో ఏమేం లాభాలు కలుగుతాయి..?



కూరగాయలు, ఆకుకూరలు అంటే మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవే కనిపిస్తాయి. కానీ మన చుట్టూ పరిసరాల్లో ఉండే వాటి గురించి అంతగా ఆలోచించం. నిజానికి అలాంటి కూరగాయలు లేదా ఆకుకూరల్లోనే అనేక ఔషధ గుణాలు ఉంటాయి. అలాంటి వాటిల్లో మునగాకులు కూడా ఒకటి అని చెప్పవచ్చు. వీటిని బయట మార్కెట్‌లో విక్రయించరు. అలా అని చెప్పి వీటిని తినకూడదు అని కాదు, తినవచ్చు, కానీ వాటిని తినాలని చెప్పి చాలా మందికి అవగాహన లేదు, ఆయుర్వేదం దీని గురించి చాలా స్పష్టంగా వివరించింది. మునగాకులు ఏకంగా 300కు పైగా రోగాలను నయం చేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు. అయితే మునగాకులు ఆరోగ్యకరమైనవి అని తెలుసు కానీ వాటిని ఎలా తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు ఆయుర్వేద వైద్యులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

# దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా సాగునీరును అందిస్తాం

- ప్రభుత్వానికి అత్యంత ప్రాము ఖ్యమైన ప్రాజెక్టు దేవాదుల
- దేవాదుల ప్రాజెక్ట్ తో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తాం
- రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క



హైదరాబాద్ ఆగస్టు 10 : అక్షరం న్యూస్)
ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ప్రాజెక్ట్ ప్రాంగణంలో జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై దేవాదుల ప్రాజెక్ట్ అధికారులతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిం చారు.దేవాదుల ప్రాజెక్ట్ ప్రభుత్వానికి అత్యంత ప్రాము ఖ్యమైన ప్రాజెక్ట్ అని, ప్రాజెక్ట్ పరిధిలోని 17 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరును అంది స్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు.ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ప్రాజెక్ట్ ప్రాంగణంలో జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపో తల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై దేవాదుల ప్రాజెక్ట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అత్యంత ముఖ్య మైన ప్రాజెక్ట్17 నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టు కు త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. 67 కోట్ల తో భూసేకరణ చేపట్టనున్నామని తెలిపారు. దశల వారిగా నిధులను విడుదల చేస్తామ న్నారు.71 మీటర్ల తో 17 నియో జకవ ర్గాలకు సాగునీరం దిస్తామని అన్నారు.

ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం వంద కోట్ల రూపాయలు ఉన్నాయని, విడతాలవారీగా విడుదల చేస్తామని, ఇందుకు సంభందించిన వివరాలను అధికారులు వెంటనే పంపాలని అధికారులను సూచించారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా ఏడాదిలో రెండు సీజన్లకు సాగు నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా అందించాలని.. అందుకు తగినవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రాజెక్టు మొదలు పెట్టినప్పుడు 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా నిర్మాణం చేపట్టినా.. మరింత పెరిగి ప్రస్తుతం ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని, సాగు నీటి ఆయకట్టు ఇంకా పెరిగే అవకాశం ఉందనీ అన్నారు.

ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి.. అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని..త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అలాగే పెరిగిన ఆయకట్టుకు కూడా నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.గతంలో ఇక్కడ 38 టీఎంసీల స్సామర్థ్యం ఉండగా.. ఇప్పుడు 78 నుంచి 80 టీఎంసీల అవసరం అవుతుందని, ఇరిగేషన్ మంత్రి ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అన్ని దశలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఛత్తీస్ గడ్ ప్రభుత్వ సాగునీటి పారుదల శాఖ మంత్రి కశ్యప్ తో చర్చలు జరుపుతున్నామని, ఛత్తీస్ గడ్ పరిధిలోని ముంపు ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు మాట్లాడినట్లు పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ పరిధిలో ఇంకా భూసేకరణ పూర్తికాని చోట్లా ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని సాగునీటి పారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన చోట్లా పరిహారం చెల్లింపులు చేసేందుకు, భూసేకరణ పనులు మొదలు పెట్టేందుకు నిధులు విడుదల చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సమీక్షా సమావేశం లో చర్చించిన అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు చిత్త శుద్దితో , నిజాయితీ తో పూర్తి సమర్ధత తో పని చేయాలనీ అన్నారు.





ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ పై ఇక్కడ సమీక్ష నిర్వహించడం రెండోసారి అని అన్నారు. పక్కనే గోదావరి ఉన్నా కన్నాయిగూడెం ప్రాంతం లో సాగునీరు అందడం లేదన్నారు. దేవాదుల ద్వారా రామప్ప చెరువు నిండితే ములుగు లోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతాయాన్నారు. తుపాకులగూడెం బ్యారేజ్ దేవాదుల బ్యారేజ్ నిర్మాణం కొరకు భూమి కోల్పోయిన రైతులకు మానవీయ కోణంలో ఆలోచించి తగినంత నష్టపరిహారం అందించాలన్నారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరు నాగారంలలో కెనాల్స్ పై ఏర్పాటు చేసిన లిస్టులో సరిగా పనిచేయక తాగునీరు అందడం లేదన్నారు. పాకల ద్వారా నర్సంపేటకు నీరందిస్తూ కొత్తగూడెం కూడా సాగునీరు అందించేలా ప్రణాళిక చేయాలని కోరారు. పేదరికాన్ని తగ్గించడానికి సాగునీరు పెంచడమే పదమ కర్తవ్యమని అన్నారు. ములుగు జిల్లా కు సంపూర్ణంగా సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే సీతక్క చెప్పిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమీక్షా సమావేశం లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక, శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వారి వారి నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటిపారుదల అంశాలను డిప్యూటీ సీ ఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆఖరు ఆయకట్టుకు దేవాదుల నీరు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కోరారు.

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ భీం ఘన్ పూర్ రిజర్వాయర్ కు సాగునీరు వచ్చేట్టు చర్యలు చేపట్టాలని కోరారు. దేవాదుల ప్రాజెక్ట్ కు సంబంధించిన వివిధ దశలు, ఇప్పటి వరకూ పూర్తయిన వివిధ దశల పనులు, భూసేకరణ, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాగునీటిపారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు వివరించారు.

ముందుగా మంత్రులు సమక్క సాగర్ ప్రాజెక్ట్ ను సందర్శించి, గంగారం లోని దేవాదుల ఇంటెక్ పంప్ హౌస్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.దేవాదుల పంపు హౌజ్ వద్ద మల్లంపల్లి మండల కొడిశల కుంటలో రూ. 2.7కోట్లతో చేపట్టిన 33/11 కెవి విద్యుత్తు ఉప కేంద్రం ను శిలా ఫలకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఇతర మంత్రులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా ములుగు మండలంలోని గట్టమ్మ, బండారుపల్లి, జగ్గన్నపేట, లింగాల, నార్లపూర్, రొయ్యూరు, బుచ్చంపేట లలో రూ. 20.73 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు.

సమీక్షా సమావేశం అనంతరం తుపాకులగూడెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నుండి హెలికాప్టర్ లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకాటి శ్రీహరి లు హైదరాబాద్ కు బయలుదేరారు.

మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో మంత్రుల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో ములుగు కలెక్టర్ దివాకర టీ.ఎస్., ములుగు ఇంచార్జీ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కారే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవో లు సత్యపాల్ రెడ్డి వెంకటేష్, ఇరిగేషన్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా కప్ 2025 టీ20లో శుభ్‌మాన్ గిల్ రీఎంట్రీ..



### హార్దిక్ పాండ్యాకు ఛాన్స్ లేదా?

ఆసియా కప్ 2025 ( టీ20 టోర్నీ దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియాలో ఎవరు రాణిస్తారు? ఎవరు కొత్తగా ఎంట్రీ ఇస్తారనే టాక్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. ఈ క్రమంలోనే యంగ్ స్టార్ శుభ్‌మాన్ గిల్ (%హ్ష్రబఎమ్ఖఅ +అశ్రీశ్రీ%) గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ వచ్చింది. గిల్ ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఈ ప్రారంభం తర్వాత, అతని కెప్టెన్సీ, అలాగే బ్యాటింగ్‌కి మరింత ఛాన్స్ వచ్చింది.

### గిల్‌ని ఎక్కడ

దీంతో రేపటి ఆసియా కప్ 2025లో గిల్, టీ20లో వైస్-కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌గా ఉంటాడని భావిస్తున్నందున, గిల్ అతని వైస్ కెప్టెన్?గా ఉంటాడని భావిస్తున్నారు. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, గిల్ టీ20లో ఓపెనర్‌గా ఆడతాడా లేక నెంబర్ 3 స్పాట్‌లో దిగతాడా? ఎందుకంటే, ఇటీవల అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఓపెనింగ్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వీళ్లిద్దరూ టీ20లో బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. మరి గిల్‌ని ఎక్కడ ఫిట్ చేస్తారో చూడాలి.

### రెండింటిలోనూ సత్తా

మరోవైపు హార్దిక్ పాండ్యా (%ఖుతీఎఅన్రాఖఅఎఖ%) గత కొన్ని సీజన్లలో మంచి ఫామ్ చూపిస్తున్నాడు. అయితే, 2025 ఆసియా కప్ టీమ్‌లో అతనికి ఎలాంటి ప్రాధాన్యం ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. టీమ్ ఎంపికలు, ప్లేయర్ల ఫిట్‌నెస్, ఫామ్‌ను బట్టి అతనికి చోటు దక్కుతుందో లేదో నిర్ణయించబడుతుంది.

హార్దిక్ ఉంటే, టీమ్ బాలన్స్ అవుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే అతను బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ సత్తా చాటగలడు. కానీ ఈసారి యువ ఆటగాళ్లు ఎక్కువగా దృష్టిలో ఉన్నారు కాబట్టి, అతని స్థానం విషయంలో పోటీ తీవ్రంగా ఉంటుందని క్రీడా వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో సెలక్షన్ టీమ్ అతని గురించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి.

### ఫ్యూచర్ కెప్టెన్?

గిల్ ఇప్పటికే ఒడీఐ టీమ్‌కి వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా మంచి ప్రదర్శన చేశాడు. చాలామంది అతన్ని 2027 ఒడీఐ వరల్డ్ కప్‌కి ఇండియా కెప్టెన్‌గా చూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఆస్ట్రేలియాలో ఈ అక్టోబర్‌లో జరిగే మూడు ఒడీఐ మ్యాచ్‌లు కోహ్లీ, రోహిత్‌లకు ఆ ఫార్మాట్‌లో చివరివి కావొచ్చని తెలుస్తోంది. వీళ్లిద్దరూ 2027 వరకూ ఆడాలంటే విజయ్ హజారే ట్రోఫీలో ఆడాలని సెలెక్టర్లు షరతు విధించారట.

## యదార్థ సంఘటనల 'ఏలుమలై'



యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఏలుమలై'. హీరోయిన్ రక్షిత సోదరుడు రాన్నా హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రియాంక ఆచార్, జగపతిబాబు ప్రధానపాత్రధారులు. పునీత్ రంగస్వామి దర్శకుడు. తరుణ్ కిశోర్ సుధీర్ నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా నుంచి భావోద్వేగపూరితమైన గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'కాపాడు దేవా..' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా డి.ఇమ్మాన్ స్వరపరిచారు. మంగ్లీ ఆలపించారు. ఓ ప్రేమ జంట విడిపోయే క్షణాలను ఈ పాట ఆవిష్కరిస్తుంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో నాగభరణ, కిశోర్‌కుమార్, సర్దార్ సత్య తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: అద్వైత గురుమూర్తి, నిర్మాణం: తరుణ్ సుధీర్ క్రియేషన్స్, డీఈ ఆర్ట్ స్టూడియోస్.

## ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్



గగన్‌బాబు, కశికాకపూర్ జంటగా, సత్యం రాజేష్, సాయి రోనక్ కీలక పాత్రధారులుగా ఎ.కె.జంపన్న దర్శకత్వంలో, తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ ఆదివారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ ఇవ్వగా, వివేక్ కూచిభట్ల కెమెరా స్విచాన్ చేశారు. చిత్ర దర్శకుడు ఎ.కె.జంపన్నకు చిత్ర నిర్మాత తోట లక్ష్మీకోటేశ్వరరావు స్క్రిప్ట్‌ని అందించారు. తొలిషాట్‌కు దర్శకుడు వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. అతిథులంతా చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. కథ నచ్చి, ఈ సినిమాను తానే నిర్మించాలనే పట్టుదలతో నిర్మాత కోటేశ్వరరావు గోల్డెన్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించారని, ఇదొక ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ అని, త్వరలోనే షూటింగ్ మొదలుపెడతామని దర్శకుడు జంపన్న తెలిపారు. తమ సంస్థ నుంచి వస్తున్న ఈ తొలి చిత్రం.. దేశమంతా మాట్లాడుకునేలా ఉంటుందని నిర్మాత తోట లక్ష్మీకోటేశ్వరరావు చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు గగన్, కాశికా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వి.కె.రామరాజు, సంగీతం: అనూప్ రూబెన్స్.

## రెండేళ్లలో ఆరు సినిమాలు



చిత్ర నిర్మాణ సంస్థ 70M M ఎంటైర్టైన్మెంట్స్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఒకేసారి ఆరు కొత్త సినిమాల స్క్రిప్టులు లాక్ చేస్తూ, ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు సంస్థ అధినేతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి. వచ్చే రెండేళ్లలో ఈ ఆరు సినిమాలను వరుసగా తెరకెక్కించి, విడుదల చేయనున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. వేర్వేరు జానర్స్‌లో ఎప్పటిలాగే క్వాలిటీ స్టోరీ టెల్లింగ్‌కి ప్రాధాన్యం ఇస్తూ ప్రేక్షకుల్ని అలరించేలా ఈ సినిమాలను నిర్మిస్తామని నిర్మాతలు తెలిపారు. తమ సంస్థ నుంచి గతంలో వచ్చిన భలే మంచిరోజు, ఆనందోబ్రహ్మ, యాత్ర, శ్రీదేవి సోడా సెంటర్ సినిమాలు వాణిజ్య పరంగా విజయాలను అందుకోవడంతో పాటు క్రిటిక్స్ అభినందనలు కూడా అందుకున్నాయి. వాటి లాగే రానున్న ఆరు సినిమాలు కూడా అద్భుతమైన నిర్మాణ విలువలతో నిర్మిస్తాం.' అని నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి తెలిపారు.

# రమేశ్‌కు కాంస్యం..సర్ఫింగ్‌లో కొత్త చరిత్ర

మహాబలిపురం: భారత సర్ఫింగ్ క్రీడలో సరికొత్త చరిత్రను లిఖిస్తూ యువ సర్ఫర్ రమేశ్ బుదిహాల్ సంచలనం సృష్టించాడు. మహాబలిపురం (తమిళనాడు)లో జరిగిన ఏషియన్ సర్ఫింగ్ చాంపియన్‌షిప్స్ -2025లో రమేశ్ కాంస్యం సాధించి సత్తాచాటాడు. ఈ ఈవెంట్‌లో భారత్ తరఫున ఇదే తొలి పతకం కావడం విశేషం. శనివారం జరిగిన పోటీల్లో ఫైనల్ చేరి ఆ రికార్డు సాధించిన తొలి భారతీయుడిగా ఘనత సాధించిన అతడు.. తుది పోరులో ఏకంగా పతకం సాధించి అందర్నీ ఆనందంలో ముంచెత్తాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్‌లో నలుగురు సర్ఫర్లు హోరాహోరీగా తలపడగా రమేశ్.. 12.60 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు. కొరియా సర్ఫర్ కనోవ హీజా (15.17 పాయింట్లు) అగ్రస్థానంతో స్వర్ణాన్ని గెలుచుకోగా పజర్ అరియానా (ఇండోనేషియా.. 14.57 పాయింట్లు) రజతం గెలిచాడు.



## అర్జున్‌కు తొలి ఓటమి

చెన్నై : చెన్నై చెస్ గ్రాండ్‌మాస్టర్స్ టైటిల్ రేసులో ఉన్న తెలంగాణ తేజం అర్జున్ ఇరిగేసికి ఈ టోర్నీ నాలుగో రౌండ్‌లో షాక్ తగిలింది. వరుస విజయాలతో రెండో స్థానంలో ఉన్న అర్జున్‌కు నాలుగో రౌండ్‌లో భారత్‌కే చెందిన నిహాల్ సారిన్ చేతిలో ఓటమి ఎదురైంది. ఆదివారం ఇక్కడ జరిగిన నాలుగో రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన నిహాల్.. 70 ఎత్తుల్లో అర్జున్‌పై విజయం సాధించాడు. గత రెండు మ్యాచ్‌లలో అపజయం పాలైన నిహాల్‌కు ఈ టోర్నీలో ఇదే తొలి విజయం. ఇదిలాఉండగా జర్మనీకి చెందిన విన్సెంట్ కెమర్.. నాలుగో గేమ్‌ను డ్రా చేసుకుని 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 2.5 పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు.




## క్రికెట్ నాకు రెండో అవకాశమిచ్చింది.. నేను విఫలమయ్యాను..!

ఇంగ్లండ్ పర్యటనలో సంచలన ప్రదర్శనతో భారత జట్టు సిరీస్ సమం చేసింది. టాపార్డర్, మిడిలార్డర్, బౌలింగ్ యూనిట్.. ఒక్కో మ్యాచ్‌లో ఇరగదీయడంతో టీమిండియా చరిత్ర లిఖించింది. జట్టులోని అందరి ఆట సంతృప్తికరంగానే ఉన్నా కరుణ్ నాయర్ (%ఖుతీబఅ చీఖుఅతీ%) మాత్రం దారుణంగా విఫలమయ్యాడనే చెప్పాలి. నాలుగు మ్యాచుల్లో ఒకే ఒక అర్ధ శతకం బాదిన అతడు అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయాడు. క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ.. ఇదే విషయాన్ని కరుణ్ సైతం అంగీకరించాడు.

'అవును.. నేను ఇంగ్లండ్ పర్యటనలో విఫలమయ్యాను. ఓవల్ టెస్టు (%ూఝుశ్రీ ుఎవర్%)లో అర్ధ శతకం బాదాను. కానీ, దాన్ని సెంచరీగా మలచలేకపోయినందుకు చాలా నిరాశ చెందాను. అయితే.. ఆదిలోనే రెండు వికెట్లతో కష్టాల్లో పడిన జట్టును పటిష్ట స్థితిలో నిలిపేందుకు నా ఇన్నింగ్స్ ఎంతో ఉపయోగపడింది. గతంలో నేను ఇక్కడ గొప్పగా ఆడాను. కౌంటీల్లో సర్రే జట్టుపై 150 రన్స్ బాదాను. అందుకు నేను భారీ స్కోర్ చేస్తానని నమ్మాను. కానీ.. శతకం కొట్టలేకపోయాను. ఇకపై అవకాశం రావాలేగానీ భారీ స్కోర్లుగా మలుస్తానని నమ్మకంతో ఉన్నాను' అని కరుణ్ వెల్లడించాడు.





## షఫాలీ పోరాటం సరిపోలే..

### పొట్టి సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్


పొట్టి సిరీస్‌లో భారత మహిళల ఏ జట్టు అద్భుతంగా పోరాడినా ఫలితం మాత్రం మారలేదు. రెండో టీ20లో 73కే ఆలౌటైన టీమిండియా నామమాత్రమైన మూడో పోరులో గట్టి పోటీ ఇచ్చినా మ్యాచ్ చేజార్చుకుంది. ఆస్ట్రేలియా ఏ నిర్దేశించిన స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(41), మిన్ను మణి(30)లు అదరగొట్టినా మిగతా బ్యాటర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. ఆఖరి ఓవర్ చివరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన గేమ్‌లో నాలుగు పరుగుల తేడాతో రాధా యాదవ్ బృందం ఓటమి పాలైంది. వరుసగా మూడో పరాజయంతో సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. ఆసీస్ పర్యటనలో భారత ఏ జట్టు తీవ్రంగా నిరాశ పరిచింది. పొట్టి సిరీస్‌లో ఒక్కటంటే ఒక్క మ్యాచూ గెలవలేదు. రెండో టీ20లో దారుణ ఓటమి నుంచి కోలుకున్న భారత ఏ జట్టు మూడో మ్యాచ్‌లో గట్టిగానే పోరాడింది. ఛేదనలో నాలుగు పరుగులకే ఓపెనర్ బ్రిందా దినేశ్(4) ఔటైనా షఫాలీ వర్మ(41) ధనాధన్ ఆడుతూ లక్ష్యాన్ని కరిగించింది. ఆమెకు రగ్వీ బిస్త్(25), మిన్ను మణి (30)లు సహకరించడంతో భారత జట్టు విజయం దిశగా సాగింది.

## ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత రోహిత్, కోహ్లీ మరో షాకింగ్ డెసిషన్..?

టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ మరో షాకింగ్ డెసిషన్ తీసుకోబోతున్నారా? ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారా? అవుననే అంటున్నాయి బీసీసీఐ వర్గాలు. గతేడాది టీ-20 ప్రపంచకప్ తర్వాత ఇద్దరూ ఒకేసారి అంతర్జాతీయ టీ-20లకు వీడ్కోలు పలికారు. ఇక, ఈ ఏడాది ఐపీఎల్ తర్వాత ఇద్దరూ ఒకేసారి టెస్ట్ ఫార్మాట్ నుంచి వైదొలిగారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డేల్లో మాత్రం టీమిండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వైట్ బాల్ క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లుగా పేరు తెచ్చుకున్న కోహ్లీ, రోహిత్ త్వరలోనే వన్డే క్రికెట్ నుంచి కూడా వైదొలగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాలో టీమిండియా వన్డే సిరీస్ ఆడబోతోంది. ఆ సిరీస్ తర్వాత రోహిత్, కోహ్లీ ఒకేసారి వన్డేలకు కూడా రిటైర్మెంట్ ప్రకటించవచ్చని తెలుస్తోంది. నిజానికి వీరిద్దరూ 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగాలని భావిస్తున్నట్టు ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే ఆ ప్రపంచకప్ ఆడాలంటే బీసీసీఐ (%దీజజ×%) నిబంధనల ప్రకారం వీరిద్దరూ ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే దేశీయ వన్డే సిరీస్ అయిన విజయ్ హజారే ట్రోఫీ ఆడవలసి ఉంటుంది.

ఈ నేపథ్యంలో విజయ్ హజారే ట్రోఫీ కీలకం కాబోతోంది. ఈ ట్రోఫీలో ఆడితేనే రోహిత్, కోహ్లీ పేర్లను ప్రపంచకప్ కోసం పరిశీలిస్తారు. ఆ ట్రోఫీలో మెరుగ్గా రాణించిన యువ ఆటగాళ్ల వైపే సెలెక్టర్లు మొగ్గుచూపుతారనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతో వీరిద్దరూ ఆస్ట్రేలియాలోనే తమ రిటైర్మెంట్ ప్రకటిస్తారని ఊహాగానాలు వినబడుతున్నాయి. ఆస్ట్రేలియాలో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే వన్డే సిరీస్ ముగిసిన తర్వాత 2027 ప్రపంచకప్ లోపు టీమిండియా మరో ఆరు వన్డే సిరీస్‌లు ఆడబోతోంది.



## సిస్టర్ సెంటిమెంట్‌తో కూడిన మాఫియా కథ?



అల్లు అర్జున్ అట్లీ సినిమాకు సంబంధించిన ప్రకటన వచ్చిన నాటి నుంచి ఈ సినిమా సెట్స్‌కి ఎప్పుడెప్పుడు వెళ్తుందా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. భారీ పానిండియా చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమాపై ఓ తాజా సమాచారం వెలుగు చూసింది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌ని అట్లీ పూర్తి చేశారట. మాఫియా నేపథ్యంలో ఓ డాన్ చుట్టూ ఈ కథ తిరుగుతుందట. ఇందులో బన్నీ పాత్రలో మూడు కోణాలుంటాయట. పైగా ఈ సినిమాలో బన్నీ నెగెటివ్ షేడ్స్‌లో కనిపిస్తారని తెలుస్తున్నది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. సిస్టర్ సెంటిమెంట్ ఈ కథలో బలంగా ఉంటుందట. ముఖ్యంగా బన్నీ అక్క పాత్ర చాలా ఎమోషనల్ టోన్‌లో సాగుతుందని తెలిసింది. ఆ పాత్రను ఓ సీనియర్ హీరోయిన్ పోషించనున్నదని టాక్ నడుస్తున్నది. అలాగే కథానుగుణంగా ఈ సినిమాలో కొన్ని గెస్ట్ రోల్స్ ఉన్నాయట. మరి ఆ రోల్స్ కోసం అట్లీ ఎవరెవర్ని అప్రోచ్ అవుతారో చూడాలి. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ త్వరలో స్టార్ట్ కానున్నది.

## 'పరదా'లో అనుపమ 2.0ని చూస్తారు..



పురుషాధిపత్యంపై విసిగిపోయిన ఓ అమ్మాయి ధైర్యంగా తీసుకున్న నిర్ణయమే ప్రధానాంశంగా రూపొందిన చిత్రం 'పరదా'. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. శ్రీనివాసులు పి.వి, శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకడ నిర్మాతలు. ఈ నెల 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. హీరో రామ్ పోతినేని ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. అందర్నీ ఆలోచింపజేసే, ఆనందింపజేసే సినిమా 'పరదా' అని కథానాయిక అనుపమ పరమేశ్వరన్ చెప్పారు. ఈ సినిమాలో అనుపమ 2.0ని చూడబోతున్నామని, తను అంత అద్భుతంగా నటించిందని నిర్మాత విజయ్ తెలిపారు. ఇది బిగ్ స్కేల్‌తో తీసిన ప్రాపర్ కమర్షియల్ సినిమా అని, ఈ మంచి ప్రయత్నానికి ఆర్థికంగా కూడా విజయాన్నిస్తే.. ఇలాంటి మంచి కథలు మరిన్ని వస్తాయని దర్శకుడు ఆకాంక్షించారు. మరో నిర్మాత శ్రీధర్ కూడా మాట్లాడారు.

## పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ రెడీనా..?


పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ షూటింగ్స్‌పై ఫోకస్ పెట్టాడని తెలిసిందే. ప్రస్తుతం హరిహరవీరమల్లు పార్టు 2, ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ ఈ స్టార్ యాక్టర్ లైన్‌లో ఉన్నాయి. వీటిలో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టు ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. అయితే కార్మిక సంఘాల వేతనాల పెంపు డిమాండ్స్‌తో షూటింగ్స్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడ్డ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమాల అప్‌డేట్స్ విషయంలో నిరాశలో ఉన్న మూవీ లవర్స్, అభిమానులకు అదిరిపోయే న్యూస్ షేర్ చేశారు మేకర్స్. బిగ్ స్క్రీన్స్‌పై అందరి ప్రశంసలు, చప్పట్లు అందుకోవడానికి క్లాప్ బోర్డు షాట్స్‌ను తొలగిస్తున్నాం. ఉస్తాద్ భగత్ సింగ్ ఎడిటింగ్ జెట్ స్పీడులో కొనసాగుతోంది. హరీష్ శంకర్ మీ అందరికి విజువల్ ఫీస్ట్‌లా అనిపించేలా పవర్ స్టార్‌ను నయా అవతార్‌లో చూపించబోతున్నాడు.. అంటూ క్లాప్ బోర్డు స్క్రీన్ షాట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఇప్పుడీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నాకీలక పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ స్టైల్ ఆఫ్ మ్యానరిజంతో సాగుతున్న డైలాగ్స్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి.

# సు ఫ్రమ్ సో రివ్యూ..

ఇటీవల కన్నడలో రిలీజ్ అయి సూపర్ హిట్ అయిన సినిమా 'సు ఫ్రమ్ సో' (సులోచన ఫ్రమ్ సోమేశ్వరం'). అతి తక్కువ బడ్జెట్ తో తీసిన ఈ సినిమా సంచలన విజయం సాధించటంతో ఇప్పుడు ఈ మూవీని అదే పేరుతో తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేశారు. మైత్రీ మూవీస్ ద్వారా విడుదలైన ఈ సినిమా 8వ తేదీన ఆడియన్స్ ముందుకు వచ్చింది. సస్పెన్స్ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ మూవీకి తెలుగునాట ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూద్దాం.

కథ విషయానికి వస్తే కర్ణాటకలోని ఓ చిన్న పల్లెటూరు మర్లూర్. అక్కడ ఏ సమస్య వచ్చినా రవన్న (షానీల్ గౌతమ్, పెద్దరికం వహించి దానిని తీర్చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆ ఊరిలోని ఓ యువకుడు అశోక్ (జెపీ తుమినాడు, )కి దెయ్యం పట్టిందని ప్రచారం జరుగుతుంది. తమ ఊరికి దగ్గరలో ఉన్న ఊరుకి చెందిన సులోచన అనే ఆవిడ ఆత్మనే అశోక్ ని ఆవహించిందనే తేల్చేస్తాడు రవన్న. దాంతో ఆ ఆత్మను శాంతింపచేసి వదిలించుకోవడానికి ఓ స్వామిజీ (రాజ్ బి శెట్టి ని తీసుకు వస్తాడు రవన్న. ఆ ఆత్మని వదల గొట్టే క్రమంలో ఆ ఊరి వారు పడే పాట్లే ఈ 'సు ఫ్రమ్ సో' సినిమా.

కథగా చూస్తే ఏమంత ఆసక్తి అనిపించదు. కానీ ఈ ఆసక్తి లేని పాయింట్ తో రెండు గంటలా పది నిమిషాల పాటు ప్రేక్షకులను అలరించిన తీరుని మాత్రం మెచ్చుకోకుండా ఉండలేం. అసలు ఆ గ్రామానికి రవన్న పెద్దరికం ఎందుకు!? వయసు వచ్చినా రవన్న బ్రహ్మచారిగానే ఎందుకు మిగిలిపోతాడు. ఆ మారుమూల గ్రామంలోని ఆచార వ్యవహారాలను కొందరు ఎలా తమకు అనుగుణంగా మలచుకుంటున్నారు? అసలు సులోచన ఎవరు? సులోచనకు భాను (సంధ్యా అరాకెరే, %ఞుఅస్త్రఝు ాతీుఎవతీవ%) మధ్య సంబంధం ఏమిటి? అశోక్ కు నిజంగానే దెయ్యం పట్టిందా? అది ఎలా వదిలింది? వీటన్నింటినీ కలుపుతూ ఆడియన్స్ ను ఎంటర్ టైన్ చేస్తూ దర్శకుడు సినిమాను తీసిన విధానమే ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. సినిమా హిట్




గ్రామీణ ప్రజలలోని అమాయకత్వం, నిజాయితీ, వేడుకల్లో వారి ప్రవర్తన, యువతలో ఉండే ఆకర్షణతో పాటు ఆ వయసులో చేయరాని తప్పు చేస్తే దానిని కప్పిపుచ్చుకోవడానికి దెయ్యం పట్టిందనే నాటకానికి తెరతీయటం, దాని పర్యవసానంతో ప్రథమార్ధం సరదాగా గడిచిపోతుంది. దెయ్యం లేదని చూసే ప్రేక్షకులకు తెలిసినా అమాయకమైన ప్రజలు పడే పాట్లు కడుపుబ్బా నవ్విస్తాయి. నిజానికి ఈ సినిమాలో నటించిన ఏ నటీనటులు మనకు పరిచయం అయిన వారు కాదు. పూర్తిగా కొత్త. అయినా ఆ భావం కలగదు. హీరోగా నటించిన అశోక్ పాత్రధారి జేపీ తుమినాడ్ ఈ సినిమాకు దర్శకుడు. తనతో పాటు రవన్నగా యాక్ట్ చేసిన వ్యక్తితో పాటు డ్రింకర్ గా నటించిన పాత్రధారి ఇలా ప్రతి ఒక్కరూ తమ పాత్రల్లో జీవించేశారు. ఇక ఈ డ్రింకర్ పాత్రధారి ఎంటర్ అయినప్పుడల్లా బ్యాక్ గ్రౌండ్ లో వచ్చే 'బావ వచ్చాడు%ఔ% బావ వచ్చాడు' అనే పాట ఎంటర్ టైన్ చేస్తుంది. ద్వితీయార్ధంలో అక్కడక్కడా కొంచెం ల్యాగ్ అయినట్లు అనిపించినా%ఔ% చివరలో భాను పాత్రకు, రవన్న పాత్రకు మధ్య లింక్ పెట్టి ముగించిన తీరు అందరినీ మెప్పిస్తుంది.

మన సొసైటీలో ఒంటరి మహిళలకు ఎదురయ్యే సమస్యలను దెయ్యం లేకుండా దెయ్యం ఉందని భ్రమింపచేస్తూ వినోదభరితంగా చూపించిన విధానాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. థియేటర్ కి వచ్చిన ప్రేక్షకుల నుంచి బాగుంది అని తప్ప.. బాగాలేదు అనే మాట వినం. సుమేద్ కె. స్వరాలు, సందీప్ తులసి దాస్ బ్యాంక్ గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాను ఎలివేట్ చేసింది. తెలుగులో సినిమాకు ఎలాంటి ప్రచారం లేకుండా విడుదల చేయటం%ఔ% తెలిసిన ఫేస్ ఏదీ లేకపోవడం ఒక్కటే ఈ సినిమాకు ఉన్న పెద్ద మైనస్. అయితే మౌత్ టాక్ ఊపందుకుంటే మాత్రం తెలుగులో కూడా మంచి వసూళ్ళను సాధించే అవకాశం లేకపోలేదు. సినిమా హిట్

## తారక్‌ని గమనించా.. నేర్చుకున్నా.. అదే ఫాలో అవుతా..

'ఈ సినిమా జర్నీలో తారక్‌ను గమనించడమే కాదు.. అతని నుంచి చాలా నేర్చుకున్నా. సింగిల్ టేక్ ఆర్టిస్ట్ అతను. వంద శాతం పెర్‌ఫెక్షన్‌తో షాట్‌కి ఎలా వెళ్లాలో తారక్‌ని తారక్ నుంచి నేర్చుకున్నా. నా తదుపరి చిత్రాలకు అతని ఫార్ములానే ఫాలో అవుతా' అని హృతిక్ రోషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'వార్-2'. జూ.ఎన్టీఆర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడక జరిగింది.

హృతిక్ రోషన్ మాట్లాడుతూ "కొన్నేళ్ల క్రితం 'క్రిష్' సినిమా కోసం ఇక్కడికొచ్చాను. ఇక్కడి హాస్పటాలిటీ, వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్, తెలుగులు చూపించిన ప్రేమ నాకెంతో నచ్చింది. నాలుగులో రోజుల్లో సినిమా వస్తుంది. యుద్ధానికి రెడీగా ఉన్నారా?' అంటూ అభిమానులో ఉత్సాహం రేకెత్తించారు.




### తారక్‌ని చూశాక ఆ పెయిన్ కూడా లేదు..

'తారక్ మీకు అన్న.. నాకు తమ్ముడు.. మనమంతా బ్రదర్స్. ఒకే కుటుంబానికి చెందినవాళ్లం. మీ అభిమానానికి, మీ ఆహ్వానానికి ఫిదా అయిపోయాను. యంగ్ టైగర్ ఫ్యాన్స్ గర్జన వినడానికి ఇక్కడికి వచ్చాను. మీ అందరిని ఇలా చూడడం చాలా ఆనందంగా ఉంది. 25 ఏళ్ల నా కెరీర్‌లో కొన్ని పాత్రలు నన్ను ఓ రేంజ్‌కి తీసుకెళ్లాయి. 'వార్స్ -2' మాత్రం టాప్‌లో ఉంటుంది. ఇందులో నేను పోషించిన కబీర్ పాత్రతో అందరూ లవ్‌లో పడతారు. అలాగే నా బ్రదర్ తారక్ నటన చూసి మరింత లవ్ చేస్తారు. యాక్షన్ సినిమాల కోసం మేం ఎంతో కష్టపడతాం. దెబ్బలు తగులుతాయి. నొప్పిని భరిస్తాం. నేను బాధతో విలవిలలాడుతుంటే, ఎన్టీఆర్ మాత్రం ఆ బాధను పంటి బిగువున పెట్టుకుని సీన్స్ చేశారు. ఈ సినిమా కోసం తారక్ చూపించిన డెడికేషన్, అతను పడిన కష్టం చూసి నాకు షూటింగ్‌లో పెయిన్ తెలియలేదు. ఈ జర్నీలో తారక్‌ను ఎంతో అబ్జర్వ్ చేశా. అతనిలో నన్ను నేను చూసుకున్నా. నాలోనూ తారక్ కనిపించాడు. సినీ రంగంలో మా ఇద్దరిదీ 25 ఏళ్ల జర్నీ. ఇండస్ట్రీలు వేరైనా ఇద్దరిదీ సింపుల్ జర్నీ. అతనిలో నేను బాగా గమనించిన విషయం ఏంటంటే.. ఒక టేక్ చేస్తాడు.. అదే ఫైనల్ అవుతుంది. (వన్ టేక్.. ఫైనల్ టేక్ స్టార్). తారక్‌ను గమనించడమే కాదు.. అతని నుంచి చాలా నేర్చుకున్నా. 99.99 శాతం కాదు వంద శాతం పెర్‌ఫెక్షన్‌తో షాట్‌కి ఎలా వెళ్లాలో తారక్‌ని చూసి నేర్చుకున్నా. సీన్ పండటం కోసం ఏమైనా చేసేస్తాడు. తీసిన సీన్ ఎలా వచ్చిందో చెక్ చేసుకోడు. ఎందుకంటే అది బాగా వస్తుందని అతనికి తెలుసు. అదే నేను తారక్ నుంచి నేర్చుకున్నా. నా తదుపరి చిత్రాలకు అతని ఫార్ములానే ఫాలో అవుతా. ఆయన మంచి నటుడే కాదు.. మంచి చెఫ్ కూడా. అతను చేసే బిర్యానీ అంటే నాకెంతో ఇష్టం' అని అన్నారు.



## స్టైల్ ఐకాన్ డౌన్ ది ఇయర్స్ చిరు.. హాటెస్ట్ స్టార్ ఆఫ్ ది ఇయర్ నాని

యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025 వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. తరాలు మారినా తరగని అందం, చరిష్మాతో, స్టైలిష్ డాన్స్‌లతో ప్రేక్షకులను అలరిస్తూ, స్టైల్‌తో ఈతరం హీరోలతో పోటీ పడుతున్న మెగాస్టార్ చిరంజీవి స్టైల్ ఐకాన్ డౌన్ ది ఇయర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే వెంకటేశ్‌కు స్టార్ ఫర్ ఆల్ సీజన్స్ అవార్డు దక్కింది. మోస్ట్ స్టైలిష్ ఐకాన్ అండ్ స్టార్‌గా అల్లు అర్జున్ నిలిచారు. అలాగే ఈ ఏడాది దక్షిణాది నటుల్లో హాటెస్ట్ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఆయన సొంతం చేసుకున్నారు. అంతే కాకుండా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో గ్లామర్, స్టైలిష్ పర్సనాలిటీస్‌కు తొలిసారి ఈ అవార్డులను ప్రకటించారు. మోస్ట్ గ్లామరస్ యూత్ ఐకాన్ అవార్డును రాశీఖన్నా అందుకున్నారు.

ట్రైల్‌బ్లేజర్ ఆఫ్ ది ఇయర్ - చిరంజీవిట్రెండ్ సెట్టర్ ఆఫ్ ది ఇయర్- అల్లు అర్జున్

మోస్ట్ డిజైరబుల్ స్టార్- సాయి ధరమ్ తేజ్ మోస్ట్ గ్లామరస్ యూత్ ఐకాన్ (మేల్)- విజయ్ దేవరకొండ రెడ్ కార్పెట్ లుక్ ఆఫ్ ది ఇయర్(ఫిమేల్)- భాగ్యశ్రీ బోర్సే ఎమెర్జింగ్ ఫేస్ ఆఫ్ ఫ్యాషన్ (మేల్) - తేజ సజ్జా మోస్ట్ గ్లామరస్ యూత్ ఐకాన్ (ఫిమేల్)- రాశీఖన్నా మోస్ట్ ఫ్యాషనబుల్ స్టార్ - విజయ్ దేవరకొండ హాట్‌స్టెప్పర్ ఆఫ్ ది ఇయర్ (మేల్)- అడవి శేష్‌హాట్‌స్టెప్పర్ ఆఫ్ ది ఇయర్ (ఫిమేల్)- మాళవిక మోహనన్ ఫ్యాషన్ ఫార్వర్డ్ స్టార్ - సిద్ధార్థ్‌విమెన్ ఆఫ్ స్టైల్ అండ్ సబ్‌స్టాన్స్ - అదితి రావ్ హైదరి ఫిట్ అండ్ ఫ్యాబులస్ (మేల్)- నవీన్ పొలిశెట్టి ఫిట్ అండ్ ఫ్యాబులస్ (ఫిమేల్) -ప్రగ్యా జైశ్వాల్ ఫ్యాషన్ రిస్క్‌టేకర్ ఆఫ్ ది ఇయర్ - లక్ష్మీ మంచు స్టైల్ ఐకాన్ (ఫిమేల్)- రాశీఖన్నా రెడ్ కార్పెట్ లుక్ ఆఫ్ ది ఇయర్(మేల్)- సందీప్ కిషన్ ఎమెర్జింగ్ ఫేస్ ఆఫ్ ఫ్యాషన్ (ఫిమేల్) - భాగ్యశ్రీ బోర్సే మోస్ట్ స్టైలిష్ డైరెక్టర్ -అనిల్ రావిపూడి మోస్ట్ స్టైలిష్ మూవీ మొగల్ -నాగ వంశీసినిమా హిట్‌అల్టిమేట్ దివ సింగర్ -చిన్మయి శ్రీపాదఅల్టిమేట్ మావెరిక్ మ్యూజిషియన్ -దేవిశ్రీ ప్రసాద్‌డేర్ టు బి డిఫరెంట్ - అల్లు శిరీష్

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609